నవతెలంగాణ
నమ్మిక తెలుగు దినపత్రిక
మెదక్
శుక్రవారం | 10 జనవరి 2025 | www.navatelangana.com

బాధితుల ఆందోళనతో మూతపడ్డ నర్సింగ్ హోమ్



నవతెలంగాణ-శివ్వంపేట

అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరితే సరియైన వైద్యం అందించకపోవడంతోనే తమ తండ్రి మరణించినాడని మృతుని బంధువులు మండల కేంద్రమైన శివ్వంపేట శ్రీసాయి నర్సింగ్ హోమ్ ఎదుట బుధవారం ఆందోళన చేపట్టిన విషయం అందరికి విదితమే. ఇక వివరాలలోకి వెళ్తే గూడూరు గ్రామానికి చెందిన బోయిని బిక్షపతి యాదవ్ అనారోగ్యంతో ఈ నెల 3న స్థానిక శ్రీసాయి నర్సింగ్ హోమ్‌కు వెళ్లగా బిక్షపతి ఆరోగ్య పరిస్థితి విషమంగా మారడంతో కొంపల్లిలోని శిఖర ఆసుపత్రికి తరలించామని, చికిత్స పొందుతూ ఈనెల 4న బిక్షపతి యాదవ్ మరణించినాడని బాధితులు చేపట్టిన ఆందోళనతో శ్రీసాయి నర్సింగ్ హోమ్ వైద్య సేవలపై వివాదం చెలరేగడంతో చేసేదేమిలేక నిర్వాహకులు ఆసుపత్రికి గురువారం తాళం వేసుకున్నారు.

పౌల్ట్రీ రైతు ఆత్మహత్య



నవ తెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ మండల పరిధిలోని తుజ్జాల్పూర్ గ్రామానికి చెందిన గొట్టిముక్కుల యాదయ్య (52) ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం ఇలా ఉన్నాయి. యాదయ్యకు రెండు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో కొన్ని నెలల క్రితం ఒక భాగాన పౌల్ట్రీషెడ్డును నిర్మించేందుకు నిర్ణయించుకున్నాడు. షెడ్డు నిర్మాణం కోసం గొట్టిముక్కుల యాదయ్య కొంత అప్పు చేసినాడు.. అయితే తాను సాగు చేస్తున్న భూమి యాదయ్య తండ్రి పేరిట ఉండడంతో తన పేరిట పట్టా చేయాలని యాదయ్య తండ్రిని అడగ్గా అతను నిరాకరించడంతో తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. బుధవారం సాయంత్రం గొట్టి ముక్కుల యాదయ్య తాను నిర్మించుకున్న పౌల్ట్రీ షెడ్డులో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్సై లింగం తెలిపారు.

సంక్రాంతికి ప్రత్యేక బస్సులు



- మెదక్ రీజియన్‌లో 295 బస్సులు
- రూ.100 టికెట్ రూ.150కి పెంపు
- 10 నుంచి 20వ తేదీ వరకు స్పెషల్ వసూళ్లే
- రూ.20 కోట్ల ఆదాయం టార్గెట్
- మహాలక్ష్మికి కష్టాలు...పురుషులపై మరింత భారం

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

మహాలక్ష్మి పథకం పేర మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ప్రారంభించాక బస్సుల కొరత ఏర్పడి రద్దీ సమస్యతో ఇబ్బందులు షురూ అయ్యాయి. ప్రయాణికుల రద్దీకి సరిపడ బస్సుల్ని పెంచకపోవడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరో వక్క పని గంటలు పెరిగి ఆర్టీసీ ఉద్యోగులు పని భారాన్ని మోస్తున్నారు. మధ్య మధ్యలో పండగల పేరిట ప్రత్యేక బస్సుల్ని నడుపుతూ ప్రయాణికులపై భారాలు మోపడం, డ్రైవర్, కండక్టర్లపై పని భారం వేయడం పరిపాటిగా మారింది. సంక్రాంతి పండగ సందర్భంగా ఆంధ్రా ప్రాంతానికి ప్రత్యేక బస్సుల్ని నడపాలని ఆర్టీసీ నిర్ణయించింది. మెదక్ రీజియన్ పరిధిలో 8 డిపోలున్నాయి. వీటి పరిధితో ఆంధ్రా ఏరియాకు బస్సులు నడపడంతో పాటు ఉమ్మడి మెదక్ జిల్లాలోని పలు ప్రాంతాల్లోనూ ప్రత్యేక సర్వీసుల్ని నపడనున్నారు. 8 డిపోల పరిధిలోని 542 బస్సులకు గాను సంక్రాంతికి 295 బస్సుల్ని ప్రత్యేకంగా నడపనున్నారు.

ప్రత్యేక సర్వీసులు ఇలా

మెదక్ రీజియన్ పరిధిలో ఉన్న 8 డిపోల నుండి సంక్రాంతి పండగ కోసం రద్దీకి తగినట్లుగా ఆయా రూట్లలో ప్రత్యేక బస్సుల్ని నడపేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. మెదక్ డిపోలో 45 బస్సులు, నర్సాపూర్ డిపోలో 20 బస్సులు, సిద్దిపేట డిపోలో 57, దుబ్బాక డిపోలో 19, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ డిపోలో 36, సంగారెడ్డి డిపోలో 45, జహీరాబాద్ డిపోలో 38, నారాయణఖేడ్ డిపోలో 35 బస్సుల్ని సంక్రాంతి పండగ కోసం ప్రత్యేక సర్వీసులుగా నడవనున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని అమలాపురం, గుంటూరు, విజయవాడ, కాకినాడ, కందుకూరు, నెల్లూరు, ఒంగోలు వంటి పట్టణాలకు ప్రత్యేంగా బస్సులు నడుపుతారు. అదేవిధంగా అన్ని డిపోలకు చెందిన బస్సులు జేబీఎస్, సికింద్రాబాద్, బాలానగర్, లింగంపల్లి, పటాన్‌చెరు సెంటర్ల నుంచి ఆయా డిపోల పరిధిలోని రూట్లకు కూడా ప్రత్యేక సర్వీసుల్ని నడపనున్నారు.

50 శాతం అదనపు ఛార్జీలు

సంక్రాంతి పండగ సందర్భంగా పది రోజుల పాటు నడిపే ప్రత్యేక బస్సుల్లో అదనపు ఛార్జీలు వసూలు చేయాలని ఆర్టీసీ నిర్ణయించింది. ఇప్పటికే ఆయా డిపోలకు ఆర్టీసీ యాజమాన్యం ప్రత్యేక బస్సుల్లో వసూలు చేయాల్సిన బస్ ఛార్జీల పట్టికను ఆయా రీజియన్ అధికారులకు అందజేశారు. ప్రస్తుతం ఉన్న ఛార్జీలకు అదనంగా 50 శాతం వసూలు చేయాలని నిర్ణయించారు. బీదర్-జహీరాబాద్-సికింద్రాబాద్, పిట్లం-జోగిపేట-సంగారెడ్డి-జేబీఎస్, నారాయణఖేడ్-సికింద్రాబాద్, మెదక్-నర్సాపూర్-జేబీఎస్, సిద్దిపేట-ప్రజ్ఞాపూర్-జేబీఎస్ వంటి ప్రధాన రూట్లలో నడిచే బస్సులతో పాటు ఆయా డిపోల నుంచి ఆంధ్రప్రదేశ్‌కు నడిపే బస్సుల్లోనూ 50 శాతం అదనపు ఛార్జీలను వసూలు చేయనున్నారు. ప్రస్తుతం రూ.100 ఉన్న ఛార్జీని రూ.150కి పెంచి వసూలు చేస్తారు. ప్రస్తుతం ఉన్న రూ.50 ఛార్జీని రూ.75 చొప్పున వసూలు చేస్తారు. పది రోజుల వరకు ప్రత్యేక బస్సుల్ని నడపడం ద్వారా మెదక్ రీజియన్‌లో సుమారు రూ.20 కోట్ల మేర ఆదాయాన్ని రాబట్టేందుకు ఛార్జీలు, బస్ సర్వీసులను ఏర్పాటు చేసింది. గతేడాది సంక్రాంతి పండగ సందర్భంగా కూడా ఆర్టీసీ ప్రత్యేక బస్సుల్ని నడిపింది. రూ.14.72 కోట్ల మేరకు ఆదాయం సమకూరింది. ఈ సారి అదనపు రోజులు, సర్వీసుల్ని నడిపి రూ.20 కోట్ల మేర ఆదాయాన్ని రాబట్టాలని అధికారులు యోచిస్తున్నారు.



పండగ పేర ఛార్జీల భారం మోపేందుకు ఆర్టీసీ సిద్దమైంది. ప్రత్యేక బస్సుల్ని నడిపేందుకు ఏర్పాట్లు చేస్తోంది. పది రోజుల పాటు ప్రమాణీకుల రద్దీని ఆదాయంగా మల్చుకునేందుకు ఎత్తులు వేస్తోంది. ప్రస్తుతమున్న ఛార్జీలకు అదనంగా 50 శాతం వసూలు చేయనుంది. మెదక్ రీజియన్ పరిధిలో రూ.20 కోట్ల మేర ఆదాయం రాబట్టేందుకు కసరత్తు చేస్తోంది. ఒక పక్క ఛార్జీల భారం మోపడంతో పాటు మరో పక్క స్థానిక ప్రయాణికులకు బస్సుల్లేకుండా పోనుంది. మహాలక్ష్మి ఫ్రీ జర్నీకి తిప్పలు తప్పవు. పురుష ప్రయాణికుల జేబులకు చిల్లులు పడే పరిస్థితి. ఇటీవల మెదక్ చర్చి 100 సంవత్సరాల వేడుకల సందర్భంగా కూడా రీజియన్ పరిధిలో ప్రత్యేక బస్సుల పేర అదనపు ఛార్జీలు పిండారు. మళ్లీ సంక్రాంతికీ వసూల్ చేయనున్నారు. ఆంధ్రా ప్రాంతానికి పెద్ద ఎత్తున పండగకు తరలివెళ్లే అవకాశమున్నందున ఆయా డిపోలకు చెందిన బస్సుల్ని ఏపీలోని పలు ప్రాంతాలకు నడపనున్నారు.

మహాలక్ష్మికి తిప్పలు... మగవారిపై అదనపు భారం

ప్రత్యేక సర్వీసుల పేరిట డిపోల పరిధిలో ఉన్న బస్సులన్నింటినీ పండగ పేర ప్రత్యేక బస్సులుగా నడపాలని ఆర్టీసీ చూస్తోంది. నర్సాపూర్ డిపో పరిధిలో 24 బస్సులుండగా 20 బస్సుల్ని స్పెషల్ బస్సులుగా నడపుతున్నారు. ఆ పది రోజుల పాటు ఆ డిపో పరిధిలో తిరగాల్సిన సర్వీసలన్నీ రద్దు అవుతాయి. దీంతో స్థానిక ప్రయాణికులకు ఇబ్బందులు తప్పవు. మరో పక్క మహాలక్ష్మి పథకం కింద మహిళలు, విద్యార్థులు ఉచిత ప్రయాణ సదుపాయం లేకుండా పోతుంది. మిగతా డిపోల్లోనూ ఉన్న బస్సుల్లో సగం వరకు సంక్రాంతి స్పెషల్ పేరిట ఆదాయం వచ్చే రూట్లల్లో తిప్పడం వల్ల స్థానిక రూట్లల్లో బస్సులు నడిచే పరిస్థితి ఉండదు. ముఖ్యంగా పల్లెవెలులకు సైతం స్పెషల్ బోర్డు వేసి ఎక్స్‌ప్రెస్ ఛార్జీలు పిండుతారు. గ్రామీణ ప్రాంతాల్లో స్కూల్ పిల్లలు, కార్మికులు, కూలీలు, చిరు వ్యాపారులు, రోజువారి ప్రయాణికులు, పండగకు ఊర్లకు వెళ్లిన వాళ్లు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తది.

జిపి కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి

- 5 నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి
- ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా
- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి. సాయిలు

నవతెలంగాణ-జోగిపేట

గ్రామపంచాయతీ కార్మికులకు పెరిగిన ధరలకనుగుణంగా కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి. సాయిలు డిమాండ్ చేశారు. గురువారం జోగిపేట ఆర్డీఓ కార్యాలయం ముందు గ్రామపంచాయతీ కార్మికులతో కలిసి ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులకు ఐదు నెలలుగా జీతాలు చెల్లించడం లేదని ఆయన ఆరోపించారు. గ్రామపంచాయతీకి వచ్చే నిధులలో మొట్టమొదట కార్మికుల జీతాలు ఇవ్వాలని జీవో నెంబర్ 60 ఉన్నప్పటికిని అధికారులు వాటిని పట్టించుకోవడం లేదన్నారు. జీతాలు అడిగితే కార్యదర్శులు బెదిరింపులకు గురి చేస్తున్నారని, అలా చేస్తున్న వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పనిచేసే క్రమంలో సబ్బులు, నూనెలు ఇవ్వడం లేదని ఆయన అన్నారు. కార్మికులకు ఐడి కార్డులు, రూ.50 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రామాలలో కార్మికులతో అన్ని రకాల పనులు చేయించుకుంటున్న వారికి మాత్రం కనీస వేతనాలు ఇతర సౌకర్యాలు కల్పించకుండా వెట్టిచాకిరి చేయించుకుంటున్నారన్నారు. గతంలో 2018 సంవత్సరంలో గ్రామపంచాయతీ కార్మికులు సమ్మె చేస్తే అప్పటి ప్రభుత్వం రూ.9500 జీతం పెంచిందని, అవి కూడా రెగ్యులర్‌గా ఇవ్వడం లేదన్నారు. జీతాల విషయంలో ఎంపీడీవో, ఎంపీఓ, కార్యదర్శులను అడిగితే కార్మికులను బెదిరిస్తూ ఇష్టం ఉంటే పనులు చేయండి లేదంటే వెళ్లిపోండి అని హుకుం జారీ చేస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికి రానున్న కాలంలో మరో మారు పోరాటం తప్పదన్నారు. అనంతరం జోగిపేట ఆర్డీఓ పాండుకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ అందోల్ డివిజన్ కార్యదర్శి డి. విద్యాసాగర్, గ్రామపంచాయతీ కార్మికులు మల్లేశం, మహేష్, సాయి, పెంటయ్య, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.



చర్చ నీయాంశంగా ఖిజర్ యప్తై గోల్డ్ కప్ క్రికెట్ టోర్నమెంట్

ప్రముఖ వస్త్ర వ్యాపార సంఘం నాయకులు అల్లాడి సాయిరాం

నవతెలంగాణ-జహీరాబాద్

జాతీయ అంతర్జాతీయ స్థాయిలో క్రికెటర్ రంగంలో జహీరాబాద్ పేరును మారుమ్రోగిస్తున్న ఘనత ఖిజర్ యప్తైకే దక్కుతుందని వస్త్ర వ్యాపార సంఘం నాయకులు అల్లాడి సాయిరాం గుప్తా అన్నారు. గురువారం జహీరాబాద్ పట్టణంలోని బాగారెడ్డి క్రీడా మైదానంలో ఖిజర్ యప్తై గోల్డ్ కప్ క్రికెట్ పోటీల్లో భాగంగా రెండు మ్యాచులు జరిగాయి. ప్రముఖ వస్త్ర వ్యాపారవేత్త అల్లాడి సాయిరాం గుప్త, ఎస్వి కన్స్ ట్రాక్షన్స్ అధినేత తట్టు విశ్వనాథ్ యాదవ్ ముఖ్య అతిధులుగా హాజరై మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ బహుమతులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా అల్లాడి సాయిరాం, తట్టు విశ్వనాథ్ యాదవ్ మాట్లాడుతూ ఇంతచక్కటి టొర్నిని కులమతాలకతీతంగా క్రీడలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇందులో అన్ని పార్టీల వారిని భాగస్వామ్యం కల్పించి స్థానిక యువతను దేశం నలుమూలల నుంచి క్రీడాకారులను రప్పించి వారి అనుభవాన్ని ఇక్కడ వేదిక ద్వారా పరిచయం చేసి స్థానిక యువకులను క్రికెట్‌పై మక్కువ పెరిగే విధంగా ఖిజర్ యప్తై చొరవ చూపడం అభినందనీయమన్నారు. ప్రథమ పోటీలో జుబేర్ అల్ ఖురేష్ ముజీబ్ సీసీ, బంజారా సీసీ జహీరాబాద్ జట్ల మధ్య జరిగిన పోటీల్లో టాస్ గెలిచి ముజీబ్ సీసీ ఫీల్డింగ్ ఎంచుకున్నది. బంజారా సీసీ నిర్ణిత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 130 పరుగులు చేయగా 13 పరుగుల లక్ష్యంతో బరిలోకి జుబేర్ సీసీ 17.5 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 131 పరుగులు చేసి విజయం సాధించి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. రెండవ పోటీలో సన్రోహి హాస్పిటల్ సీసీ, మస్కతి సీసీ జట్ల మధ్య జరిగిన పోరులో సన్రోహి హాస్పిటల్ సీసీ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్నది. నిర్ణిత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 268 పరుగులు చేయడంతో 269 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సన్రోహి సీసీ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 230 పరుగులు చేయడంతో విజయం సాధించి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. ముఖ్య అతిథులు తట్టు విశ్వనాథ్ యాదవ్, అల్లాడి సాయిరాం చేతుల మీదుగా వెయ్యి రూపాయల నగదు, ట్రాఫీతో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు ప్రధానం చేశారు. కార్యక్రమంలో ఆహ్వాన కమిటీ చైర్మన్ రాములు నేత, జ్యోతి పండల్, అదం యప్తై, అబుద్ యప్తై, నిర్వాహక కమిటీ అధ్యక్షుడు సంతోష్ గుప్త, తులసీదాస్ గుప్త, మొయిజుద్దీన్ లష్కరి, వ్యాఖ్యాతలు అబ్దుల్లా సిద్ధిఖీ, మొహమ్మద్ ఫెరోజ్, మీడియా ఇంచార్జ్ సయ్యద్ మహేబూబ్ అలీ, రాకేష్ పబ్బతి, అప్సర్ దిల్దార్ తదితరులు పాల్గొన్నారు.



సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలి

- ఇంటింటికి సీపీఐ(ఎం) పేరుతో విరాళాల సేకరణ
- సంగారెడ్డి జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు



నవతెలంగాణ-సంగారెడ్డి

సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర నాలుగో మహాసభలు ఈనెల 25 నుంచి 28 వరకు సంగారెడ్డి పట్టణంలో జరుగుతున్నాయని మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ సంగారెడ్డిలోని బృందావన్ కాలనీలో ఇంటింటికి సీపీఐ(ఎం) పేరుతో విరాళాలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) సంగారెడ్డి జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు మాట్లాడుతూ ప్రజా ఉద్యమాల సారథి సీపీఐ(ఎం) అని కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న పార్టీ సీపీఐ(ఎం) అని అన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఐ(ఎం) ఎల్లప్పుడూ పోరాడుతుందని తెలిపారు. దేశంలో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు ఇవ్వాలని, కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని నిరంతరం ఉద్యమాలు చేస్తుందన్నారు. విద్యా వైద్యం కార్పొ రేటీకరణను వ్యతిరేకిస్తూ ప్రభుత్వ రంగాన్ని కాపాడుకోవాలని పోరాటాలు నిర్వహిస్తుందని భవిష్యత్తు పోరాటాలకు సంగారెడ్డి వేదిక కాబోతుందన్నారు. ఈనెల 25న జరిగే బహిరంగ సభకు ముఖ్య అతిథిగా సీపీఐ(ఎం) పోలీట్ బ్యూరో సభ్యురాలు బృందాకారత్ హాజరవుతున్నారని బహిరంగసభలో జిల్లా ప్రజానికం వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి. అశోక్, మహేష్ శివకుమార్, రమేష్, మొగుల్ గౌడ్, దత్తు తదితరులు పాల్గొన్నారు.



వాటర్ సప్లై కార్మికులకు పెరిగిన వేతనం అమలు చేయాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

మున్సిపల్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ.26,000లు ఇవ్వాలని, వాటర్ సప్లై కార్మికులకు పెరిగిన వేతనం రూ.1000లు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.యాదగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు నిర్వహించి అనంతరం ఏవోకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.యాదగిరి మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన సంగారెడ్డి మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. వాటర్ సప్లై కాంట్రాక్ట్ కార్మికులకు పెరిగిన వేతనం చెల్లించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవరిస్తుందన్నారు. గత సంవత్సరం నుంచి వాటర్ సప్లై కార్మికులకు రూ.1000లు పెంచకపోవడంలో మతలబు ఏముందన్నారు. కార్మికులకు అందరికీ పెంచాల్సిన ప్రభుత్వము కార్మికుల మధ్య వ్యత్యాసం చూపించడం ఎంతవరకు సమంజసమన్నారు. కార్మికులకు కనీస వేతనాలు రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు మారుతున్నా కార్మికుల బతుకులు మాత్రం మారడం లేదన్నారు. కార్మికులను ఐక్యం చేసి ప్రభుత్వం పైన పోరాటం నిర్వహిస్తామని ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు రాజు, సంగమేశ్వర్, జనార్ధన్, రాజు, శ్రీనాథ్, తాజుద్దీన్ కృష్ణ, గోవర్ధన్,కృష్ణ నాగరాజు, మల్లేశం, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

రైతుల భూముల్లో రియల్ వ్యాపారి జులూమ్



దౌర్జన్యంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు పట్టాభూమి కబ్జా

నవతెలంగాణ-కొండాపూర్

దౌర్జన్యంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు పట్ట భూమిని కబ్జా చేసిన సంఘటన కొండాపూర్ మండలం ముందేనిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే ఆ గ్రామానికి చెందిన రైతులు అర్సగొల్ల లక్ష్మి, ఎర్నోళ్ల ఎల్లమ్మ సాయి లక్ష్మమ్మ, నర్సగోల్ల కృష్ణలకు గ్రామ శివారులోని సర్వేనెంబర్ 60లో 13గుంటల పట్టా భూమి ఉంది. ఆనంద్ కుమార్ రెడ్డి, రాములు, కళ్యాణ్ కలిసి రైతుల పట్టా భూమిపై కన్నేసి అన్యాయంగా కబ్జా చేసి స్థానిక రైతులను బెదిరించి కబ్జా చేసి, చుట్టు ప్రహరీ గోడ నిర్మించి, ఇంటి నిర్మాణాన్ని చేపట్టారు. నాలా పర్మిషన్ లేకుండా, ఇష్టానుసారంగా నిర్మాణం చేపడుతున్నారనే ఆరోపణలున్నాయి. రైతులు తమ భూమిని ఎందుకు కబ్జా చేసావని ప్రశ్నిస్తే వారి పైన బెదిరింపులకు పాల్పడుతూ భౌతిక దాడులకు గురి చేస్తున్నాడు.కబ్జాదారుల నుంచి తమ భూమిని కాపాడి, తమకు న్యాయం చేయాలని రైతుల అధికారులను వేడుకుంటున్నారు.

వెలిమెల తాండ గిరిజన రైతులకు పోలీసుల కౌన్సిలింగ్

సర్వే నంబర్ 434 వద్ద ఘర్షణ వాతావరణం
తమ భూములు తమకే చెందాలి
గిరిజనుల ఆందోళన

నవతెలంగాణ-రామచంద్రాపురం:

బిలా దాఖలు భూములు తమకే చెందాలని పోరాటం చేస్తున్న వెలిమెల తాండ గిరిజన రైతులను గురువారం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి పంపించి వేశారు. వెలిమెల తాండా సర్వే నెంబర్ 434లో గత 3 రోజులుగా తీవ్ర ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. బిలా దాఖలు భూమిలో గిరిజనులు సుమారు 40 సంవత్సరాలుగా సాగు చేసుకుంటూ పొజిషన్లో ఉన్నప్పటికీ అధికారులు అపర్ణా, మే ఫేర్ సంస్థలకు వత్తాసు పలుకుతూ తమకు చెందాల్సిన భూమిని వారికి కట్టబెడుతున్నారని గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గత 3 రోజులుగా జెసిబిలతో పనులు చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నారని రైతులు తెలిపారు. గురువారం 434 సర్వే నెంబర్ వద్ద మరల ప్రైవేట్ సంస్థ వ్యక్తులు జెసిబిలతో పనులు చేసేందుకు యత్నించడంతో గిరిజనులకు వారికి మధ్య ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు పెద్ద ఎత్తున అక్కడకు చేరుకొని గిరిజన రైతులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి పంపించి వేశారు.

ఇదిలా ఉండగా గిరిజనులు మాట్లాడుతూ వందలాది మంది పోలీసులు భూమి వద్దకు చేరుకొని పేదల భూములను కాజేస్తున్న అపర్ణా కన్స్ట్రక్షన్, మే ఫెయిర్ కన్స్ట్రక్షన్ కంపెనీల వారికి సహకరిస్తూ రైతులను బెదిరిస్తున్నారని, బౌన్సర్లను పెట్టి హంగామా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ఉన్నతాధికారులకు మొరపెట్టుకున్నా న్యాయస్థానాలు తమకు అనుకూలమైన తీర్పు ఇచ్చినా బడా బాబులకు అధికారులు సహకరిస్తూ కోట్ల విలువ చేసే భూములను కాజేసేందుకు సహకరిస్తున్నారని ఆరోపించారు. న్యాయస్థానం తమకు అనుకూలంగా తీర్పు పత్రాలను ఇచ్చినప్పటికీ వాటిని ప్రభుత్వ అధికారులు పట్టించుకోవడం లేదని స్పష్టం చేశారు. ఏదిఏమైనా తమకు న్యాయం జరిగేంత వరకు పోరాడుతామని బాధితులు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషయంపై దృష్టి సాధించి పేదలకు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. పేదల పక్షపాతి, పేదల కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం నేడు గిరిజన రైతులకు చెందాల్సిన వెలిమెల బిలా దాకలు భూములు వారికే చెందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ఇస్నాపూర్ మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

నవతెలంగాణ-పటాన్ చెరు

ఇస్నాపూర్ గ్రామ పరిధిలోని మత్స్యకారుల సంక్షేమానికి సంపూర్ణ సహకారం అందించడంతో పాటు, మత్స్యకారుల సొసైటీలో నూతన సభ్యత్వానికి కృషి చేస్తున్నామని పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. గురువారం పటాన్‌చెరు పట్టణంలోని ఎంఎల్ఏ క్యాంపు కార్యాలయంలో ఇస్నాపూర్ మత్స్యకార సహకార సంఘం, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, ఇరిగేషన్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇస్నాపూర్ గ్రామ పరిధిలోని వివిధ చెరువుల పరిధిలోగల మత్స్యకార సహకార సంఘంలో నూతన సభ్యత్వం అందించడం గ్రామానికి చెందిన ముదిరాజ్ సంఘం సభ్యులు ఎమ్మెల్యే జీఎంఆర్ దృష్టికి తీసుకువచ్చారు. గ్రామ పరిధిలోని పెద్ద చెరువు చేప పిల్లల పెంపకానికి అనువుగా లేదని సంబంధిత కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులు నివేదిక ఇవ్వడం మూలంగా, చేప పిల్లలు పంపిణీ చేయడం మత్స్యశాఖ జిల్లా అధికారి నరసింహారావు ఎమ్మెల్యే జీఎంఆర్‌కి తెలిపారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే జీఎంఆర్.. చేపల పెంపకం పైన పూర్తిగా ఆధారపడి జీవనం కొనసాగిస్తున్న ముదిరాజ్ సంఘం సభ్యులు ఆర్థికంగా నష్టపోతారని, పెద్ద చెరువు కాలుష్యంపై సమగ్ర నివేదిక అందించాలని పిసిబి అధికారి గీతను ఆదేశించారు. పెద్ద చెరువుకు సంబంధం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి సభ్యత్వం అందించాలని అధికారులను ఆదేశించారు. పిసిబి నివేదిక అనంతరం పెద్ద చెరువు పరిధిలోని పరిశ్రమల ద్వారా మత్స్యకారులందరికీ ప్రతి ఏటా నష్టపరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం రామచంద్రాపురం రాయసముద్రం చెరువు పరిధిలోని మత్స్యకార సహకార సంఘం సభ్యులతో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ డిఈ రామ స్వామి, ఇస్నాపూర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు రాఘవేందర్, వైస్ ప్రెసిడెంట్ గోపాల్, సలహాదారులు పెంటయ్య, నర్సింలు, రవీందర్, రామచంద్రాపురం ముదిరాజ్ సంఘం సభ్యులు శ్రీశైలం, రాములు, వెంకట్, గాంధీ శ్రీను, పెద్ద రాజు, టెంట్ హౌస్ శ్రీను, ఉమ శ్రీను పాల్గొన్నారు.......



వేతనాలను చెల్లించాలని ఆర్‌డీఓ కార్యాలయ ముట్టడి



నవతెలంగాణ-పట్‌పల్లి

పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల వేతనాలను వెంటనే విడుదలన చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో గౌర్రెకల్ జిపి కార్మికులు ఆర్‌డీఓ కార్యాలయాన్ని గురువారం ముట్టడించారు. ఈ సందర్భంగా సీఐటీయూ అందోల్ డివిజన్ కన్వీనర్ విద్యాసాగర్ రావు మాట్లాడుతూ ఉదయం ఐదు గంటల మొదలుకొని సాయంత్రం 6 గంటల వరకు జీపి కార్మికులు గ్రామంలో విధులు నిర్వహిస్తున్నా వారి సేవలను ప్రభుత్వం గుర్తించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు పెరిగిన ధరలకనుగుణంగా వేతనాలు పెంచాలన్నారు కార్మికులకు భద్రత, బీమా సౌకర్యాలను కల్పించాలన్నారు. బకాయి వేతనాలను వెంటనే విడుదల చేసి జిపి కార్మికులను ఆదుకోవాలని సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ఆర్డీవో కార్యాలయాన్ని ముట్టడించారు. అనంతరం ఆర్డీవో పండుకు వినతి పత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో యాదయ్య మహేష్ జిపి కార్మికులు పాల్గొన్నారు

సీపీఐ (ఎం) రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

- మండల కార్యదర్శి కె చంద్రన్న



నవతెలంగాణ-ఝరాసంగం

నిరంతరం ప్రజా పోరాటాల సారథి భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఈనెల 25 నుంచి 28 వరకు సంగారెడ్డి జిల్లాలో నిర్వహించే రాష్ట్ర నాలుగవ మహాసభలను జయప్రదం చేయాలని మండల కార్యదర్శి కె చంద్రన్న కోరారు. గురువారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ అభివృద్ధి కార్యాలయ ఆవరణలో గోడ పత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ మహాసభలకు కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మొట్టమొదటిసారిగా తెలంగాణ రాష్ట్ర మహాసభలను సంగారెడ్డి జిల్లాలో నిర్వహించడం జరుగుతుందని.. అందుకు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

విద్యార్థులతో ఎంపీడీవో. ముఖాముఖి



నవతెలంగాణ-మునిపల్లి

మండలంలోని లింగంపల్లి ప్రాథమిక పాఠశాలను గురువారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి హరి నందన్ రావు సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ విద్యార్థులతో మధ్యాహ్న భోజనం రుచి, అమలు విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులతో ముఖాముఖిలో పాల్గొన్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను విద్యార్థులతో చర్చించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సాయమ్మ ఉపాధ్యాయులు అమ్మినోద్దీన్ పంచాయతీ కార్యదర్శి షబ్బం పాల్గొన్నారు.

నర్సరిని పరిశీలించిన ఎంపీడీఓ



నవతెలంగాణ-మనూర్

నాగల్గిద్దా మండలంలోని కారముంగిలో గల నర్సరిని గురువారం ఎంపిడిఓ మహేష్ రావ్ పరిశీలించారు. మొక్కల పెరుగుదల నిర్వహణ గురించి తెలుసుకున్నారు. చెట్లల్లో గడ్డి ఉండకుండా చూడాలని నీరు ఉదయం సాయంత్రం పెట్టాలని సూచించారు. నాటిన మొక్క ఎండకుండా జాగ్రత్త తీసుకోవాని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల సూపర్ చెకప్ సర్వే మావినల్లి కారముంగి ఔదాతపూర్ ఏస్గి శిఖరఖానా తదితర గ్రామాలలో చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు గ్రామస్తులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో మిర్జాపూర్ (బి) విద్యార్థి ఎంపిక



నవతెలంగాణ-న్యాల్‌కల్

తెలంగాణ బయోలజీ సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన బయోలజీ టాలెంట్ టెస్టు 2025లో రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో మిర్జాపూర్ (బి) జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి సాదియా నౌసిన్ ఎంపిక అయిందని హెచ్ఎం రాజ్ కుమార్ తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయడం కోసం ఇలాంటి టాలెంట్ టెస్టులు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన సాదియా నౌసిన్‌కు ఉపాధ్యాయుల బృందం శాలువాతో సన్మానించి అభినందించారు. తనను ప్రోత్సహించిన ఉపాధ్యాయులకు, తోటి విద్యార్థులు, బంధుమిత్రులకు విద్యార్థిని కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సరస్వతి, శ్రీకాంత్, తదితర ఉపాధ్యాయులు ఉన్నారు

మండల అధ్యక్షుడులుగా ఎన్నిక పట్ల కృతజ్ఞతలు



నవతెలంగాణ-న్యాల్ కల్

నూతన పంచాయతి సెక్రెటరీల మండల అధ్యక్షులుగా గోవర్ధన్ ఎన్నిక అయ్యారు. మల్గి తాజా మాజీ సర్పంచ్ మారుతి పంచాయతీ సెక్రెటరీ మండల అధ్యక్షులు గోవర్ధన్‌కు శాలువాతో సన్మానించి, కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా విశ్వనాథం



నవతెలంగాణ ఝరాసంగం

ఝరాసంగం మండల బిజెపి పార్టీ అధ్యక్షుడిగా రెండవసారి బంటు విశ్వనాథం ఎంపికైనట్లు తెలిపారు. జిల్లాలోని పట్టణ, మండలాల అధ్యక్షుల ఎంపికలో భాగంగా తమకు పార్టీ అధిష్టానం రెండవసారి అవకాశం కల్పించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో తన వంతు కృషి చేస్తానన్నారు. తనకు మండల అధ్యక్షులుగా ఎంపిక చేసినందుకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు గోదావరి అంజిరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ నౌబాద్ జగన్, పార్టీ కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ మండల అధ్యక్షునిగా శ్రీకాంత్ రెడ్డి



నవతెలంగాణ-కొండాపూర్

మండల పరిధిలోని గుంతపల్లి గ్రామానికి చెందిన పట్లోళ్ల శ్రీకాంత్ రెడ్డి బీజేపీ మండల అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికైనారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ.. తనపై విశ్వసం ఉంచి రెండో సారి మండల అధ్యక్షునిగా అవకాశం కలిపించిన రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి, ఎంపీ రఘునందన్ రావు,జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజి రెడ్డి, మండలంలో గల రాష్ట్ర,జిల్లా,మండల సహచర కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. బీజేపీ నియమ నిబంధనలకనుగుణంగా నడుచుకుని పార్టీ సిద్ధాంతం, విధులను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ ప్రతిష్టకు కృషిచేస్తానన్నారు. కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోడీ న్యాయకత్వంలో ప్రవేశ పెట్టిన పథకాలను ప్రజలోకి తీసుకెళ్లి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

జహీరాబాద్ బీజేపీ పట్టణ అధ్యక్షులుగా సంతోష్



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణ బిజెపి అధ్యక్షునిగా పూల సంతోష్‌ను నియమిస్తూ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. గురువారం పూల సంతోష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించినందుకు పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి ఉంటానన్నారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి ,కేంద్ర మంత్రి బండి సంజయ్ ,బిజెపి జిల్లా అధ్యక్షులు గోదావరి అంజి రెడ్డి , మాజీ ఎంపీ బీబీ పాటిల్ , జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి , నియోజకవర్గ ఇంచార్జ్ ముత్తి రెడ్డి, జిల్లా నాయకులు గొల్ల భాస్కర్, శుభాష్ రెడ్డి లకు కృతజ్ఞతలు తెలియజేశారు.

పాడి పశువుల పెంపకంతో రైతుకు మేలు

- డాక్టర్ సంతోష్



నవతెలంగాణ-సదాశివపేట

సదాశివపేట మండలం పరిధిలోని నాగసన్ పల్లి గ్రామంలో పాడి పశువులలో పాల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో విజేతలైన రైతులకు డాక్టర్ సంతోష్ కుమార్ బహుమతులను అందజేశారు. మొదటి బహుమతి కే రామచంద్రయ్య రెండవ బహుమతి ఏ మల్లయ్య మూడో బహుమతి కే గోపాల్‌లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్క పాడి రైతుకు మినరల్ మిక్చర్, క్యాల్షియం టానిక్ ఇందులో భాగంగా అన్ని లేక దూడలకు నట్టల నివారణ మందులు కూడా తాపడం జరిగినది. ఈ మినరల్ మిక్చర్ ద్వారా పాల ఉత్పత్తి పెరుగుతుంది పశువుల ఆరోగ్య పరిస్థితి మెరుగు పడుతుందని రైతులకు సూచించారు. నేటి దూడలే రేపటి పాడి పశువులు అవుతాయని, కొత్తగా శాస్త్రవేత్తలు లింగ నిర్ధారణ వీర్యాన్ని కనుగొన్నారని ఈ ఎదసూది వేసుకుంటే 95 శాతం మేలు



రకమైన ఆడ దూడలు పుడతాయని ప్రతి రైతు కుటుంబంలో ఒకటి రెండు పాడిపశులు పెంచుకోవాలని ఆ కుటుంబం ఆర్థికంగా ఎదుగుతుందని చిన్నపిల్లలకు నాణ్యమైన పాలు త్రాగించాలని ఆరోగ్య సమస్యలు అధిగమిస్తారని రైతులకు పశువుల గురించి పూర్తి అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో గోపాలమిత్ర సూపర్‌వైజర్ సి అర్జునయ్య, ఏ మౌనిక, గోపాల మిత్రులు ఎం రమేష్, ఎం యాదయ్య, టి కృష్ణ, మరియు గ్రామ నాయకులు,పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యత శిబిరానికి ఆచార్య విద్యార్థిని ఎంపిక



నవతెలంగాణ-జహీరాబాద్

సమైక్యత శిబిరానికి ఆచార్య డిగ్రీ కళాశాల విద్యార్థిని ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చింతల హరికుమార్ తెలిపారు. గురువారం కర్ణాటక రాష్ట్రంలోని గుల్బర్గా పట్టణంలో ఈ నెల 15 నుంచి 21 వరకు జరిగే జాతీయ సమైక్యత శిబిరానికి ఉస్మానియా విశ్వవిద్యాలయం తరఫున ఆచార్య డిగ్రీ కళాశాలకు చెందిన బి బి ఏ తృతీయ సంవత్సరం విద్యార్థిని పి ప్రజ్వల ఎంపికయ్యారు. ఏడు రోజులపాటు జరిగే ఈ సదస్సుకు అనేక రాష్ట్రాల నుంచి ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గుల్బర్గా యూనివర్సిటీ జన గంగా క్యాంపస్‌లో జరిగే కార్యక్రమంలో వివిధ విశ్వవిద్యాలయాల నుంచి ఎంపికైన వాలెంటర్లు దేశ సమైక్యతను చాటి చెప్పే అనేక సాంస్కృతిక కార్యక్రమాలు జాతీయ సమైక్యత నిర్మాణంలో యువత పాత్ర గురించి ఈ సమావేశంలో అనేకమంది వక్తలు పాల్గొని జాతీయ సమైక్యతను చాటి చెప్పే సూచనలు అందిస్తారు. భారతదేశంలోని సమాజాల సామాజిక ఆర్థిక అభివృద్ధికి సహకరిస్తూ విద్యార్థుల పాత్రను పొందించడంలో ఎన్ ఎస్ ఎస్ కీలక పాత్ర పోషిస్తుంది. ఈ కార్యక్రమానికి ఎంపికైన పి ప్రజ్వలను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చింతల హరికుమార్ ప్రోగ్రాం ఆఫీసర్ కే నందు గౌడ్, అధ్యాపకులు అభినందించారు.

పంచాయతీ సెక్రెటరీల నూతన కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-న్యాల్ కల్

న్యాల్‌కల్ మండల పంచాయతీ సెక్రటరీల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన పంచాయతీ సెక్రెటరీ మండల అధ్యక్షులుగా గోవర్ధన్ , ఉపాధ్యక్షులు మల్లేశం, జనరల్ సెక్రటరీగా ధనరాజ్ ఎన్నికయ్యారు. మహిళ ఉపాధ్యక్షులుగా రేణుక, కోశాధికారి అరుణ జ్యోతి, సెక్రెటరీలు కార్యదర్శులు అమూల్య రజనీకాంత్, సంతోష్, తిరుపతి, ప్రతాప్ రెడ్డి, నూతన పంచాయతీ సెక్రెటరీ కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన పంచాయతి సెక్రెటరీల కార్యవర్గాన్ని శాలువా పూలమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమం లో ఎంపీడీవో రాజశేఖర్, ఎంపిఓ సురేష్, సెక్రెటరీలు ఉన్నారు. నూతన అధ్యక్షులు ఉపాధ్యక్షులు మాట్లాడుతూ సెక్రెటరీల సమస్యలు పరిష్కారం కోసం తమ వంతు కృషి చేస్తానన్నారు. నూతన కార్యవర్గానికి మండల పంచాయతి అధికారులు సహకరించాలని కోరారు

నవ సమాజ నిర్దేశకులుగా ఎదగండి

- పటాన్ చెరు డీఎస్పీ రవీందర్ రెడ్డి
- అలరించిన విద్యార్థుల సంస్కృతిక కార్యక్రమాలు
- స్కూల్ టాపర్స్ కు బహుమతుల ప్రధానం
- ఘనంగా శ్రీ చైతన్య హై స్కూల్ 32వ వార్షికోత్సవం





నవతెలంగాణ-పటాన్ చెరు

కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి రేపటి నవభారత నిర్దేశకులుగా ఎదగాలని పటాన్‌చెరు డిఎస్పి రవీందర్ రెడ్డి ఉద్బోధించారు. గురువారం పటాన్‌చెరులోని శ్రీ చైతన్య సీబీఎస్ హైస్కూల్‌లో స్కూల్ డైరెక్టర్ కె.నరసింహ ఆధ్వర్యంలో 32వ వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డీఎస్పీ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ గత 32 సంవత్సరాలుగా శ్రీ చైతన్య హై స్కూల్ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని నాణ్యమైన విద్యను అందిస్తూ, విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తున్న స్కూల్ డైరెక్టర్ నరసింహను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు చక్కగా చదువుకొని ముందుకు వెళితే మంచి ఉద్యోగాలు దొరుకుతాయని సూచించారు. ముఖ్యంగా క్రమశిక్షణతో పాటు అన్ని రకాల క్రీడల్లో రాణించాలని తెలిపారు. విద్యార్థులు శ్రద్ధ పెట్టి చదివితే ఐఏఎస్, ఐపీఎస్, ఇంజనీర్, తదితర ఉన్నతమైన ఉద్యోగాలలో స్థిరపడడానికి అవకాశాలు ఉంటాయని తెలిపారు. చక్కగా చదువుకొని స్కూల్, చదువు చెప్పిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల పేరును నిలబెట్టాలన్నారు. ముఖ్యంగా సోషల్ మీడియాలో వచ్చే మంచిని నేర్చుకోవాలి కానీ, సమాజానికి హాని చేసే మెసేజ్లను పట్టించుకోవదని సూచించారు. విద్యార్థులు వీలైనంత మట్టుకు సెల్ ఫోన్‌కు దూరంగా ఉండాలని, సాధ్యమైనంత వరకే ఇంటర్నెట్ ను వాడాలన్నారు. అదేవిధంగా వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా విద్యార్థినీ విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు నృత్యాలు అందరిని ఎంతగానో అలరించాయి. స్కూల్ టాపర్ హర్షవర్ధన్, అమీర్ మేరాజ్ విద్యార్థులకు డీఎస్పీ రవీందర్ రెడ్డి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు, రామచంద్రాపురం ఎంఈఓలు నాగేశ్వం రావు, పి.పి రాథోడ్, శ్రీ చైతన్య సీబీఎస్ హై స్కూల్ డైరెక్టర్ కె.నరసింహ, సొసైటీ ప్రెసిడెంట్ కె.విజయలక్ష్మి ప్రిన్సిపల్ సీబీఎస్ వినయశ్రీ, కో డైరెక్టర్ కె.సాయి వినయ్, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, స్కూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-జోగిపేట

అందోల్ జోగిపేట మున్సిపల్ పట్టణంలోని కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు గురువారం అందోల్ తహశాల్దార్ కార్యాలయంలో చెక్కులు పంపిణీ చేశారు. మున్సిపల్ పరిధిలో 41 కళ్యాణ లక్ష్మి, 9 షాది ముబారక్ చెక్కులు మంజూరైనట్లు అందోల్ తహసిల్దార్ విష్ణు సాగర్ తెలిపారు. లబ్ధిదారులకు చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ మక్త జగన్మోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లయ్య, డిప్యూటీ తహశీల్దార్ మధుకర్ రెడ్డి, మండలం పార్టీ అధ్యక్షులు బి.శివరాజ్, మున్సిపల్ కౌన్సిలర్లు డాకూరి శివశంకర్, కోరబోయిన నాగరాజు, చందర్ నాయక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పట్లోళ్ల ప్రవీణ్ కుమార్, మధుసూదన్ రెడ్డి, జోగి రెడ్డి, అశోక్, నాగరాజు, బిజెపి నాయకులు వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

ఎడ్లబండ్లతో వైకుంఠపురానికి బయలుదేరిన భక్తులు



నవతెలంగాణ-చౌటకూర్

మండల కేంద్రంలోని శ్రీశ్రీశ్రీ అన్నపూర్ణ కాశీ విశ్వేశ్వర దేవాలయం కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా గురువారం ఉదయం సంగారెడ్డి పట్టణ శివారులో గల వైకుంఠపురం దేవాలయం వరకు పాదయాత్ర నిర్వహిస్తున్నారు. గత పది సంవత్సరాల నుంచి పరిసర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు పాదయాత్ర చేస్తూ, అదేవిదంగా గత ఐదు సంవత్సరాలుగా ఎడ్లబండ్లతో వైకుంఠపురానికి బయలుదేరి వెళుతున్నామని కమిటి సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా మాజీ సిడిసి చైర్మెన్ సుభాష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నత్తి దశరథ, విశిష్ట అతిథులుగా గ్రామ మాజీ సర్పంచులు జనార్ధన్, వీరమణి మొగులయ్య, లక్ష్మారెడ్డి, పిఆర్ఆర్ ట్రస్ట్ చైర్మన్ పార్కుల రాంరెడ్డిలు పాల్గొని కొబ్బరికాయలు కొట్టి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిం చారు. అదేవిధంగా వివిధ గ్రామాల ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని హరే రామ హరే రామ, హరే కృష్ణ హరే కృష్ణ అని పాటలు పాడుతూ నృత్యాలు చేస్తూ గ్రామ పురవీధుల్లో తిరుగుతూ వైకుంఠపురానికి బయలుదేరారు. ఈ కార్యక్రమంలో శ్రీరామసేన కమిటీ సభ్యులు, విశ్వహిందూ పరిషత్ సభ్యులు, భజరంగ్ దళ్ సభ్యులు, భక్తులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొ న్నారు.

పాఠశాలకు పుస్తకాలు బహుకరించిన ఉపాధ్యాయురాలు



నవతెలంగాణ-న్యాల్‌కల్

రేజింతల్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న మానస రెడ్డి తమ మొదటి నెల జీతం విద్యార్థులకు కొరకు పుస్తకాలు స్టడీ మెటీరియల్‌కు అందించారు. ఈ మేరకు ఆమెను మండల విద్యాధికారి మారుతి రాథోడ్ అభినందించారు. గురువారం ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఎంఈఓ మారుతి రాథోడ్ హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయురాలు మానస రెడ్డి తమ సొంత డబ్బులు రూ. 4 వేలతో 80 మంది విద్యార్థులకు పుస్తకాలు స్టడీ మెటీరియల్‌ను అందించారని ఎంఈఓ మారుతి రాథోడ్ తెలిపారు. రేజింతల్ ప్రాథమిక పాఠశాలకు విద్యార్థులు విద్యతో మరింత మెరుగుపడుతుందన్నారు. సేవా కార్యక్రమాలను చేసేందుకు గ్రామ యువకులు తోటి ఉపాధ్యాయులు పాలుపంచుకోవాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. వెనుకబడిన విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సేవాదాత మాన స రెడ్డి, హెచ్ఎం సఫియా సుల్తానా పాఠశాల చైర్మన్ రామే శ్వరి బసయ్య స్వామి, కాంప్లెక్స్ హెచ్ఎం రాజ్ కుమార్, హెచ్ఎం గురునాథ్, ఉపాధ్యాయులు వెంకట్ రెడ్డి, శ్రీకాంత్, విద్యార్థులు ఉన్నారు.

నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో క్రీడోత్సవాలు



నవతెలంగాణ-సదాశివపేట

ప్రభుత్వ డిగ్రీ కళాశాల సదాశివపేటలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో యువజన క్రీడోత్సవాలు నిర్వహించారు. ఈ క్రీడల్లో కబడీ,షటిల్, వాలీబాల్, రన్నింగ్ మొదలగు క్రీడలలో పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రిన్సిపాల్ బంగ్లా భారతి మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని విద్యార్థులకు ఫిజికల్ ఫిట్నెస్ సాధించడానికి ఉపయోగపడతాయన్నారు. అందరూ తప్పనిసరిగా ఈ కార్యక్రమంలో పాల్గొని విజయం సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సిద్ధులు, మురళీకృష్ణ, సర్వయ్య, రామరెడ్డి, శకుంతల, విద్యార్థి విద్యార్థులు పాల్గొన్నారు.

బొల్లారంలో శ్రీ సాయి విద్యానికేతన్ హైస్కూల్ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-ఐడిఏ బొల్లారం

బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ సాయి విద్యా నికేతన్ హై స్కూల్ నూతన సంవత్సర 2025 క్యాలెండర్‌ను గురువారం మినుముల సంతోష్ రెడ్డి, మినుముల దీప్తి ముఖ్య అతిథిలుగా హాజరై ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బొల్లారంలో పేద విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని అతి తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్యను బోధిస్తూ, భావి తరాలకు ఆదర్శంగా నిలుస్తున్న శ్రీ సాయి విద్యా నికేతన్ విద్యా సంస్థ యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. స్కూల్ వ్యవ స్థాపకులు, డైరెక్టర్ యు.ఉమా మహేశ్వర రావు, ప్రధాన ఉపాధ్యాయురాలు బి.వి.పద్మావతి, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


సైబర్ నేరాలు అరికట్టేందుకు జాగ్రత్తలు అవసరం



నవతెలంగాణ-న్యాల్‌కల్

మిర్జాపూర్ (బి) ప్రభుత్వ జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో విద్యా ర్థులకు సైబర్ నేరాలపై హద్నూర్ ఎస్సై చల్ల రాజశేఖర్ అవగాహన కల్పించారు. విద్యార్థులు సైబర్ నేరాలతో అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని, ఫోన్ లో ఓటిపి వస్తే మెసేజ్ లింకులు ఓపెన్ చేయకూడదని సూచించారు . విద్యార్థులు చదువులో పోటీపడి ఉన్నత స్థాయికి చేరుకోవాలని తెలియజేశారు. విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలి. రోడ్డు ప్రమాదాల పట్ల సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని అవగాహన కల్పించారు. ఈ అవగాహన లో హద్నూర్ పోలీసులు శామయ్య హెచ్ఎం రాజ్ కుమార్, ఉపాధ్యాయులు శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

350 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



నవతెలంగాణ-మునిపల్లి

హైదరాబాద్ నుంచి అక్రమంగా లారీలో గుజరాత్ రాష్ట్రానికి తరలిస్తున్న 350 క్వింటళ్ల రేషన్ బియ్యాన్ని కంకోల్ టోల్ ప్లాజా వద్ద మునిపల్లి పోలీసులు పట్టుకున్నారు. ఇందుకు సంబంధించి మునిపల్లి ఎస్సై రాజేష్ నాయక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ నుంచి గుజరాత్ రాష్ట్రానికి అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్టు పక్కా సమాచారంతో సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం కంకోల్ టోల్ ప్లాజా వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాల తనిఖీ చేపడుతుండగా ఒక కంటైనర్ జీజే18బివి 8013 నంబర్ గల లారీని ఆపి తనిఖీ చేయగా అందులో అక్రమంగా 650 సంచుల్లో 350 పిడిఎస్ బియ్యం ఉన్నట్టు నిర్ధారించారు. పట్టుబడిన రేషన్ బియ్యాన్ని సదాశివపేట సివిల్ సప్లై డిప్యూటీ ఎమ్మార్వో అధికారి సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు మునిపల్లి ఎస్సై రాజేష్ నాయక్ తెలిపారు.

ప్రజా సమస్యల వెలికితీతలో మేటి 'నవతెలంగాణ'



నవతెలంగాణ-శివ్వంపేట

ప్రతి నిత్యం సమాజంలోని ప్రజా సమస్యలను వెలికితీయడంలో నవతెలంగాణ పత్రిక మేటి అని కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకులు పులిమామిడి నవీన్ గుప్త అన్నారు. గురువారం శివ్వంపేటలో నవతెలంగాణ నూతన సంవత్సర క్యాలెండర్‌ను మండల రిపోర్టర్ బాలేష్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నవీన్ గుప్త మాట్లాడుతూ నవతెలంగాణ కథనాలతో ఎన్నో రకాల సమస్యలు పరిష్కారమయ్యాయని, పేద ప్రజల పక్షాన నిలబడే నవతెలంగాణ పత్రికకు గ్రామాలలో ఎంతో ప్రజాదరణ కలిగిఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు వంజరి గౌరీశంకర్, జిల్లా యువ నాయకులు షేక్ అలీ, కొత్తపేట సార శివరామగౌడ్, సోమన్నగారి నల్లపోచగౌడ్, లక్ష్మణ్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

- సీనియర్ సివిల్ జడ్జి జితేందర్

నవతెలంగాణ-మెదక్

నిరుద్యోగ అభ్యర్థులు వాలంటీర్, పారా వాలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి జితేందర్ తెలిపారు. జాతీయ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలు, సూచనల మేరకు జిల్లాలో పారా లీగల్ వాలంటీర్‌లుగా సేవలు అందించేందుకుగాను అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఆదాయం కోసం చూడకుండా స్వచ్ఛందంగా తమ సేవలను అందించే మనస్తత్వం కలిగి సమాజ సేవ దృక్పథం కలిగి ఉండి, ఆసక్తి కలిగినవారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలతో సంబంధిత సర్టిఫికెట్‌లను జత చేసి జిల్లా న్యాయ సేవాధికారి సంస్థకు ఈ నెల 24వ తేది సాయంత్రం 5 గంటల వరకు తమ దరఖాస్తులను అందజేయాలని కోరారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం కమిటీ ద్వారా ఎంపిక చేయబడుతారని తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని, కే వెంకటాపూర్ గ్రామానికి చెందిన ఆంజనేయులుకు రూ.17,500లు, భుజేందర్‌కు రూ.33,000ల సీఎంఆర్ఎఫ్ చెక్కులు శాసనమండలి వైస్ చైర్మెన్ బండ ప్రకాష్ గురువారం హైదరాబాదులోని మినిస్టర్ క్వార్టర్స్‌లో బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం శస్త్ర చికిత్సలు చేయించుకున్న పేదలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేయడం హర్షనీయమన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వారికి ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. దయాకర్ మాట్లాడుతూ తమ గ్రామానికి చెందిన బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంజూరు చేయించిన వైస్ చైర్మన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీబీ పేట ఎంపీపీ బాలమణి, మహిపాల్, రాజు పిట్ల, డప్పు శివరాజ్, తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం



నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ పురపాలక సంఘ పరిధిలో గత కొన్ని సంవత్సరాలుగా పారిశుద్ధ్య కార్మికునిగా విధులు నిర్వహిస్తూ గజ్జల పెద్ద ఎల్లం అనారోగ్య కారణాలతో బుధవారం మరణించింది. విషయాన్ని తెలుసుకోన్నా మున్సిపల్ చైర్‌పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ గురువారం ఎల్లం కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. అనంతరం అప్పుల బాధలు భరించలేక ఆత్మహత్య చేసుకున్న బిజిలిపురం యాదగిరి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం చేశారు. అదేవిధంగా, అనారోగ్య కారణాలతో మరణించిన దాసరి యాదగిరి పార్థివ దేహానికి నివాళులర్పించి, వారి కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో 3వ వార్డు కౌన్సిలర్ ఉమా సత్యలింగం, చిట్టిమిల అనిల్, బొల్లు నాగులు, మామిండ్ల శ్రీనివాస్, కొత్తపల్లి నర్సింగరావు, గుర్రం రాములు, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మధు, పాల్గొన్నారు.

పాఠశాలకు టీవీ బహుకరణ



నవతెలంగాణ-పాపన్నపేట

పాపన్నపేట మండల పరిధిలోని నర్సింగ్ రావు పల్లి ప్రాథమిక పాఠశాలకు పాఠశా ల నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయురాలు సంధ్య రాణి టీవీ బహుకరించారు. ఈ టీవీని మండల విద్యాధికారి ప్రతాప్ రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్లిన సంధ్యారాణికి పాఠశాల ఉపాధ్యాయులు వీడ్కోలు పలికి సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిరంజీవి కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీనివాసరావు, పాపన్నపేట ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్ తో పాటు ఉపాధ్యాయులు అజయ్, మౌనిక పాల్గొన్నారు

12న వివేకానంద జయంతి



నవతెలంగాణ-మెదక్

వివేకానంద జయంతిని ఈ నెల 12న నిర్వహిస్తున్నట్లు యువజన క్రీడా శాఖ జిల్లా అధికారులు నాగరాజు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వివేకానంద ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. యువజన సంఘాల వారు, నాయకులు హాజరుకావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అనారోగ్యంతో మాజీ వార్డు సభ్యురాలు మృతి



నవతెలంగాణ-కౌడిపల్లి

గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతున్న మాజీ వార్డు సభ్యురాలు ఓబలాశి లక్ష్మి (50) మృతి చెందారు. 2013 నుంచి 2018 వరకు కౌడిపల్లి గ్రామపంచాయతీ వార్డు సభ్యురాలుగా ఓబలాశి లక్ష్మి పదవి బాధ్యతలు చేపట్టారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యానికి గురై బుధవారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, గౌడ జన హక్కుల పోరాట సమితి, జిల్లా అధ్యక్షులు చంద్రం దుర్గ గౌడ్, రిటైర్డ్ ఎస్సై శేట్టయ్య, రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగులు మాటూరు శాఖయ్య, చంద్రం వెంకట్ గౌడ్, మహ్మద్ నగర్ సొసైటీ వైస్ చైర్మన్, చిలుముల చిన్న చిన్నరెడ్డి, రిటైర్డ్ టీచర్ పుండరీకం గౌడ్, ప్రధానోపాధ్యాయుడు ఓంప్రకాశ్, నాయకులు గురువారం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు.



బీజేపీ శివ్వంపేట మండల అధ్యక్షులుగా పెద్దపులి రవి

నవతెలంగాణ-శివ్వంపేట

భారతీయ జనతా పార్టీ శివ్వంపేట మండల అధ్యక్ష లుగా పిల్లుట్ల గ్రామానికి చెందిన తాజామాజీ సర్పంచ్ పెద్దపులి రవి రెండోసారి ఎన్నికయ్యారు. గురువారం బీజేపీ పార్టీ మెదక్ జిల్లా ఎన్నికల ఇంచార్జి మీసాల చంద్రయ్య, బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ మండల పార్టీ అధ్యక్షులుగా రవికి నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ సంస్థాగతంగా పార్టీ బలోపేతానికి ప్రతినిత్యం కృషి చేస్తానన్నారు. తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి పేరు, పేరున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అంతకు ముందు రవిని జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించి, అభినందలు తెలియజేశారు. మండల పార్టీ అధ్యక్షులుగా పెద్దపులి రవి రెండోసారి ఎన్నిక కావడంతో బీజేపీ మండల పార్టీలో నయా జోష్ నెలకొనగా, మండల వ్యాప్తంగా ఆయన అభిమానులు సంబరాలు చేసుకున్నారు.

పేదలపై కనికరం చూపాలి



నవతెలంగాణ-మెదక్

సమాజంలో ఉన్న పేదవారిపై కనికరం చూపాలని పాస్టర్ అబ్రహం సూచించారు. బుధవారం రాత్రి కూచన పల్లి గ్రామంలోని చర్చిలో నిర్వహించిన ఆరాధనలో సీఎస్ఐ పాల్గొన్నారు. ఆరాధనలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఎంతమంది పేదలు ఉన్నారని వారిపై కనికరం చూపాలని ఆయన కోరారు.

యూజీసీ మార్గదర్శకాలను రద్దు చేయాలి

- యూజీసీ మార్గదర్శకాలు ఫెడరలిజానికి ముప్పు
- ఎస్ఎఫ్ఐ మెదక్ జిల్లా కార్యదర్శి అజయ్ కుమార్



నవతెలంగాణ-మెదక్

యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) తీసుకువచ్చిన మార్గదర్శకాలు ఫెడరలిజానికి ముప్పు వాటిల్లే విధంగా ఉన్నాయని, యూజీసీ మార్గదర్శకాలను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ మెదక్ జిల్లా కార్యదర్శి అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. యూజీసీ మార్గదర్శకాలను నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ మెదక్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అజయ్ కుమార్ మాట్లాడుతూ ఇప్పటికే దేశంలో ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వంలో ఉన్న పలు రాష్ట్రాల్లో గవర్నర్లతో విశ్వవిద్యాలయాల నిర్వహణ, రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలను కాలరస్తు కేంద్ర ప్రభుత్వం ఏకధాటిగా తీసుకువచ్చిన ముసాయిదా ఫెడరలిజాన్ని దెబ్బతీస్తుందన్నారు. కొత్త ముసాయిదా నిబంధనలు విద్యా రంగంలో కార్పొరేట్ సంస్కృతిని పరిచయం చేస్తుందన్నారున. ఇది కోర్ డిసిప్లిన్‌లో స్పెషలైజేషన్‌ను తొలగించడం ద్వారా అధ్యాపకుల నాణ్యతను భారీగా తగ్గించడమేనన్నారు. ఇది అత్యాధునిక పరిశోధన నుంచి ఇప్పటికే ఉన్న జ్ఞానాన్ని పునరుద్ఘాటించడం వైపు దృష్టిని మార్చుతుందన్నారు. అసోసియేట్ ప్రొఫెసర్, వైస్ ఛాన్సలర్ నియామకాల పట్ల పారదర్శక లేకుండా కేవలం యూజీసీ కనుసనల్లో సాగే కమిషన్లు సెర్చ్ కమిటీలు ఏమాత్రం పారదర్శకతను ప్రదర్శించలేని విధంగా ఉన్నాయన్నారు. యుజిసి నిబంధనల ముసాయిదాను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు లేదంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు ఈ కార్య క్రమంలో జిల్లా అధ్యక్షులు నవీన్, విద్యార్థులు రాజు, నవీన్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు

ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన

- ప్రాజెక్టు మేనేజర్ కృష్ణ



నవతెలంగాణ-నిజాంపేట

నిజాంపేట్ రైతు వేదికలో జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ, వ్యవసాయ శాఖ, లివ్ పామ్ రిసోర్సెస్ ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో గురువారం ఆయిల్ పామ్ పంట సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ కృష్ణ, మండల వ్యవసాయ అధికారి సోమ లింగా రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు, ఆయిల్ పామ్ విస్తరణ అధికారులు, మండల రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణ మాట్లాడుతూ ఆయిల్ పామ్ పంట సాగు వలన రెట్టింపు ఆదాయం పొందవచ్చని, ఒక ఎకరా వరి వేసే నీళ్ళతో 5 ఎకరాల ఆయిల్ పంట పండించవచ్చని తెలిపారు. పైగా ఆయిల్ పామ్ పంట దేశంలో ఏ పంటకి లేని విధంగా చట్టం ద్వారా, ఎటువంటి మధ్యవర్తులు లేకుండా నేరుగా సంబధిత కంపెనీ కొనుగోలు చేస్తారని తెలిపారు. కోతుల బెడద లేని పంట కాబట్టి రైతులందరూ ముందుకు వచ్చి ఆయిల్ పంట సాగు చేపట్టాలని రైతులకు సూచించారు. అంతే కాకుండా ఉద్యాన శాఖ ద్వారా ఆయిల్ పామ్ సాగు చేపట్టు రైతులకు మొక్కలపై రాయితి ఇవ్వబడుతుందన్నారు. ఆయిల్ పామ్ సాగుపై కూలంకషంగా వివరించారు. ఇప్పటివరకు 1723 ఎకరాలకి రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరిగిందని తెలిపారు. అందులో నుంచి ఇప్పటి వరకు 360 ఎకరాలు ఆయిల్ పామ్ తోటలు పెట్టించడం జరిగిందన్నారు. కావున మెదక్ జిల్లాలోని రైతులు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన పెంచుకొని అధిక విస్తీర్ణంలో ఆయిల్ పామ్ సాగు చేపట్టి ఇతర పంటల కంటే అధిక దిగుబడి లాభం పొందాలని సూచించారు.

పిల్లుట్లకు ఎంపీ నిధులు మంజూరు



నవతెలంగాణ-శివ్వంపేట

మండలంలోని పిల్లుట్ల గ్రామంలో పలు అభివృద్ధి పనుల నిర్వహణ కోసం మెదక్ ఎంపీ రఘునందన్ రావు రూ.13 లక్షలను మంజూరు చేయించారు. ఈ మేరకు బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు పెద్దపులి రవి, మండల ప్రధానకార్యదర్శి గుల్లయ్యగారి సుదర్శన్, గ్రామ కమిటీ అధ్యక్షులు బొంది శ్రీనివాస్ గౌడ్, ఆలయ కమిటీ మాజీ అధ్యక్షులు బాసంపల్లి శ్రీధర్ గౌడ్ గురువారం మాట్లాడారు. గత నవంబర్ 30న గ్రామంలో పిల్లుట్ల గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవానికి వచ్చిన ఎంపీ రఘునందన్ రావుకు గ్రామంలో కమ్యూనిటీ హల్స్, సీసీ రోడ్లు, పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణం, సీసీ రోడ్ల నిర్మాణం, మురుగు కాలువల నిర్మాణం, మౌలిక వసతుల కోసం రూ.40 లక్షల మంజూరు చేయాలని, తాజామాజీ సర్పంచ్ పెద్దపులి రవి వినతిపత్రం అందజేయడంతో స్పందించిన ఎంపీ రఘునందన్ రావు స్పందించి, పిల్లుట్ల అంగన్వాడీ భవన నిర్మాణానికి రూ.8 లక్షల సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.5 లక్షల మంజూరు చేసినట్లు తెలిపారు. మిగతా పనులకు అతి త్వరలోనే మరిన్ని నిధులు కేటాయిస్తానని ఎంపీ హామీ ఇచ్చినట్లు రవి తెలిపారు. గ్రామానికి నిధులు మంజూరు చేసినందుకు గ్రామస్తుల తరుపున మెదక్ ఎంపీకి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు గ్రామకమిటీ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

- మెదక్ ఎమ్ వి ఐ విజయలక్ష్మి.



నవతెలంగాణ-మెదక్

అతివేగం, నిర్లక్ష్యం, ర్యాష్ డ్రైవింగ్‌ను నివారించాలని మెదక్ ఎమ్‌విఐ విజయలక్ష్మి వాహనదారులను కోరారు. రోడ్డు భద్రతా మాసాన్ని దృష్టిలో ఉంచుకుని మెదక్ జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో భారీ వాహనాలు (లారీ), డీ సి ఎం,ఆటో డ్రైవర్లతో గురువారం రోడ్డు భద్రతా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మద్యంతాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని తల్లి దండ్రులకు సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం వల్ల ఇష్టారీతిన నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. దానికి తల్లిదండ్రులు బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. వాహనాన్ని నడిపే ప్రతి ఒక్కరూ సీటు బెల్టు ధరించాలని ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని కోరారు.. ఈ కార్యక్రమంలోఏ ఏమ్ వి ఐ జి.శ్రీనివాస్ రావు, ఏ ఎమ్ వి ఐ శ్రీలేఖ, ఏ ఓ భాను ప్రకాష్ రిటైర్డ్ ఎమ్ వి ఐ హెచ్.గణేష్ సిబ్బంది సందీప్, సంతోష్,శ్రావణి, రవాణా కార్యాలయం సిబ్బంది డ్రైవర్ లు తదితరులు పాల్గొన్నారు..

పోస్ట్ కార్డు ఉద్యమం



నవతెలంగాణ-పాపన్నపేట

సంత్ శ్రీశ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి ఫిబ్రవరి 15న సెలవుదినం ప్రకటించాలని పోస్ట్ కార్డు ఉద్యమం చేపడుతున్నట్లు ఫూల్ సింగ్ నాయక్ రాజు నాయక్ రమేష్ నాయక్‌లు తెలిపారు. పాపన్నపేట్ జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులతో రాజు నాయక్ ఫూల్ సింగ్ నాయక్ రమేష్ నాయక్ లు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బంజారా సేవాలాల్ మహారాజ్ జయంతి ఫిబ్రవరి 15న సెలూవు దినం ప్రకటించాలని పోస్ట్ కార్డ్ ఉద్యమం నిర్వహించాలని నిర్ణయించామన్నారు. అందులో భాగంగా పోస్ట్ కార్డుని ఆవిష్కరించామని తెలిపారు. స్వాతంత్రం సిద్ధించి 77 సంవత్సరాలు గడుస్తున్నా బంజారాల ఓటుతో ఎన్నో ప్రభుత్వాలు గద్దెనెక్కినా తమ గురువు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి ఫిబ్రవరి 15న సెలవు దినం ప్రకటించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కావున ప్రధానమంత్రి నరేంద్ర మోడీ , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలకు సేవాలాల్ మహారాజ్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలని కోరుతూ పోస్ట్ ద్వారా విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సక్రు నాయక్ రెడ్యా నాయక్ మోహన్ నాయక్ తుకారాం నాయక్ సురేష్ నాయక్ అంబ్రూ నాయక్ తదితరులు పాల్గొన్నారు

విద్యావ్యవస్థ బలోపేతంపై చర్యలు

- కలెక్టర్ రాహుల్ రాజ్

నవతెలంగాణ-పాపన్నపేట

విద్య వ్యవస్థను బలోపేతం చేయడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మండలంలోని చికోడు జిల్లా పరిషత్ హై స్కూల్ షెడ్యూల్ కులాల బాలుర వసతి గృహాన్ని గురువారం ఆయన సందర్శించారు. ముందుగా విద్యార్థుల భోజనశాలను, స్టోర్ రూమ్ పరిశీలించారు. మెనూ అమలు తీరును హై స్కూల్ ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తరగతి గదిలో కలెక్టర్ టీచర్‌గా మారి పాఠాలు బోధించి ప్రశ్నలతో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్య వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకొంటు న్నదని, అందులో భాగంగానే మెనూ సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదివి రాబోయే తరానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట చీకోడు జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు, సంబంధిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయం వద్ద ఏర్పాట్లు

నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలో వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలో ఉన్న అతి పురాతనమైన కప్పల లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానం వద్ద మున్సిపల్ చైర్ పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ ఆదేశాల మేరకు పారిశుద్ధ్య పనులతో పాటు ఇతర ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మధు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెదక్ ఎమ్మెల్యే చర్యలు హర్షణీయం

- కలెక్టర్ రాహుల్ రాజు



నవతెలంగాణ-మెదక్

జిల్లా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటులో స్థానిక శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు కృషి అభినందనీయమని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. మెడికల్ కళాశాలలో మున్సిపల్ కౌన్సిల్ మెదక్ అధ్వర్యంలో మెడికల్ కాలేజీలో మహిళా సంఘాల ద్వారా సరస్వతి స్లమ్ సమాఖ్య ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటు చేయడంలో ఎమ్మెల్యే చేసిన కృషి మరువలేనిదన్నారు క్యాంటీన్ ఏర్పాటుకు సంబంధించిన ఆర్డర్ కాపీని మహిళా సంఘ సభ్యులకు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సరస్వతి స్లమ్ సమాఖ్య అధ్యక్షులు, క్యాంటిన్ సభ్యులు శ్రీమతి పి.అనిత, ఎ. సంధ్యారాణి, అమీన బేగం, జి. ఉద్విత, శాఫియా బేగం, పి.డి.మెప్మా శ్రీమతి ఇందిం, టి.యం.సి సునిత కమ్యూనిటీ ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

ఆర్పీఎల్‌లో బీఎంఆర్, సీఆర్ఆర్, ఎస్ఈకేల విజయం



నవతెలంగాణ-రామాయంపేట

రామయంపేట పట్టణంలో జరుగుతున్న ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌లలో బీఎంఆర్, సీఆర్ఆర్, ఎస్ఈకె టీంలు విజయం సాధించి ప్రతిభను చాటాయి. రామాయంపేట కళాశాల మైదానంలో గురువారం జరిగిన మొదటి మ్యాచ్‌లో బీఎంఆర్, జెటీ టీంలు పోటీ పడగా బీఎంఆర్ 9 పరుగుల తేడాతో విజయం సాధించింది. రెండవ మ్యాచ్లో పీఎస్ఆర్, సీఆర్ఆర్‌టీమ్‌లు పోటీపడిగా సీఆర్ఆర్ ఎనిమిది వికెట్ల తేడాతో గెలుపొందింది. మూడవ మ్యాచ్‌లో ఎస్ఈకే, సిఆర్ఆర్ పోటీ పడగా ఏసీకే 28 పరుగుల భారీ విజయం సాధించింది. మొదటి మ్యాచ్ కు టీయూడబ్ల్యూజే(ఐజేయు)రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.జి శ్రీనివాస్ శర్మ, మెన్ ఆఫ్ ది మ్యాచ్ అందించాడు. రెండవ మ్యాచ్‌కు టీపీసీసీ కార్యదర్శి చౌదరి సుప్రభాతారావు, మూడవ మ్యాచ్‌కు ఆర్గనైజర్ వెన్నెల కిరణ్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జిల్లా సంయుక్త కార్యదర్శి మర్కు నగేష్, రామాయంపేట ప్రెస్ క్లబ్ జేఏసి అధ్యక్షుడు బసన్నపల్లి మల్లేశం, ముదిరాజు మహాసభ జిల్లా అధ్యక్షులు పుట్టి రాజు, మున్సిపల్ కౌన్సిలర్‌లు దేమే యాదగిరి, సుందర్ సింగ్, పార్టీ నాయకులు అల్లాడి వెంకటి, చింతల స్వామి, పోచమ్మల అశ్విని శ్రీనివాస్, డాక్టర్ సతీష్, నిర్వాహకులు మల్లేష్ బసన్నపల్లి, ఉమా మహేష్, సతీష్, వెన్నెల కిరణ్, ఆర్కే మల్లేశం, సుభాష్ రాథోడ్, పలువురు పాలొన్నారు.

'హెల్మెట్ ధారణ ప్రాణానికి రక్షణ'

- తూప్రాన్ డీఎస్పీ వెంకటరెడ్డి



నవతెలంగాణ-తూప్రాన్

జాతీయ రహదారి 44 పై ప్రమాదాల నివారణకై సేవ్ లైఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తూప్రాన్ టోల్ ప్లాజా వద్ద ఉన్న టీజీఆర్ఎస్ గురుకుల పాఠశాలలో గురువారం 'హెల్మెట్ ధారణ ప్రాణానికి రక్షణ' అనే అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తూప్రాన్ డీఎస్పీ వెంకటరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవ్ లైఫ్ ఫౌండేషన్ రోడ్డు ప్రమాదాల నివారణకు జాతీయ రహదారి 44ని దత్తత తీసుకున్నారని తెలిపారు. వాహనదారులు రహదారులపై ప్రయాణించేటప్పుడు హెల్మెట్ తప్పని సరిగా ధరించాలని, వారి గమ్యాన్ని సురక్షితంగా చేరుకోవాలని సూచించారు. అందులో భాగంగానే అతివేగంగా ప్రయాణిం చే వాహనాలపై ఆటోమేటిక్ చాలన్ జనరేట్ అయ్యేవిధంగా ఏఎన్పిఆర్ కెమరాలో ఇంస్టాల్ చేసినట్లు తెలిపారు. అలాగే రోడ్డు ఇంజనీరింగ్ డిఫెక్ట్ ఉన్న ప్రదేశాలను గుర్తించి, దానిని సరి చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. ప్రథమ చికిత్స, క్షతగాత్రులను సురక్షితముగా తరలించే శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించామని పేర్కొన్నా రు. దీంతో సేవ్ లైఫ్ ఫౌండేషన్ వారి సహాయం జాతీయ రహదారి 44 పై ప్రమాదాల నివారణకు ఎంతో దోహదప డుతుందని సంస్థ వారిని డీఎస్పీ వెంకటరెడ్డి అభినందిం చారు. ఈ కార్యక్రమంలో సీఐ రంగకృష్ణ, ఎస్ఐలు జి.శివానందం, సుభాష్ గౌడ్, ప్రిన్సిపల్ పి.బి.మురళి, సేవ్ లైఫ్ ఫౌండేషన్ బాధ్యులు, పాఠశాల ఉపాధ్యాయ బృందం, ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, హోంగార్డులు కానిస్టేబుళ్లు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



గ్రామపంచాయతీ కార్మిక సంఘం అధ్యక్షులుగా తలారి శ్రీకాంత్



నవతెలంగాణ-మనోహరాబాద్

మండల గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం ఎన్నికలను గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు గ్రామపంచాయతీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆసిఫ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో గ్రామపంచాయతీ కార్మికుల మండల కమిటీ మండలంలో 17 గ్రామాలలో కార్మికులు 45 మంది సమక్షంలో స్థానిక ముత్యాలమ్మ గుడి దగ్గర గ్రామపంచాయతీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆసిఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం అధ్యక్షులుగా తలారి శ్రీకాంత్ ఉపాధ్యక్షులుగా స్వామి, కార్యదర్శి భాస్కర్, సహాయ కార్యదర్శి సురేష్, కోశాధికారిగా కర్రె కృష్ణ, కమిటీ సభ్యులుగా యాదమ్మ ఇందిరా, లక్ష్మీ, బలమని పుష్ప మైసమ్మ అర్జున్ అండాలు ముత్యాలమ్మ శోభలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ కార్మికుల శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలని వారికి జిల్లా బాడీ అండగా ఉంటుందని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని 17 గ్రామ పంచాయతీల కార్మికులు పాల్గొన్నారు.

గురుకులాల్లో అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలి



నవతెలంగాణ-మెదక్

రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో నడుస్తున్న గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పిలుపునిచ్చారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ గోడపత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు విద్యార్థులను గురుకులాల్లో చేర్పించేందుకు ఫిబ్రవరి 1 వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ విద్యాలయాల్లో చేరి ఉన్నత భవిష్యత్తుకు మార్గం సుగమం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, రీజనల్ కోఆర్డినేటర్ గంగరామ్ నాయక్, జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాస్ రాయ్, కౌడిపల్లి పాఠశాల ప్రిన్సిపల్ ఫణి కుమార్, ఉపాధ్యాయుడు ఉదయ్ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

- కాంగ్రెస్ జిల్లా నాయకుడు నరేందర్ రెడ్డి



నవతెలంగాణ-వెల్దుర్తి

వివిధ కారణాలతో చికిత్స పొందుతున్న లబ్ధిదారులకు మండల పరిధి కుక్కునూరు గ్రామంలో గురువారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కాంగ్రెస్ జిల్లా నాయకుడు నరేందర్ రెడ్డి, రాష్ట్ర ఫిషర్మెన్ కార్యదర్శి తలారి మల్లేష్ , కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు మహేష్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సుధాకర్ గౌడ్‌తో కలిసి అనారోగ్య కారణాలతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లబ్ధిదారులకు కుకునూరు గ్రామానికి చెందిన రవికి రూ. 17,500లు, రమకు రూ.60 వేలు, సత్తయ్యకు రూ.20 వేల చెక్కులను లబ్ధిదారుల కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆపదలో ఉన్నవారు సీఎం రిలీఫ్ ఫండ్ దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేయించి వారికి అందజేసే బాధ్యత కాంగ్రెస్ తరపున తాము ముందున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు నరసింహ రెడ్డి, తలారి హనుమేష్ పిఏసిఎస్ డైరెక్టర్ కృష్ణ గౌడ్, సంద్రు వెంకటరెడ్డి, మైసయ్యతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

మహిళల రక్షణ చట్టాలపై అవగాహన



నవతెలంగాణ-అక్కన్నపేట

మండలంలోని గౌరవెల్లి జిల్లా పరిషత్ హై స్కూల్‌లో విద్యార్థిని విద్యార్థులకు మహిళల రక్షణ చట్టాలపై గురువారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఐ శ్రీనివాస్ పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అందుకోవాలన్నారు. చదువుకునే సమయంలో ఎలాంటి చెడు ఆలోచనలకు తావియ్యకూడదని తెలిపారు. సైబర్ మోసలపై పట్ల, అపరిచిత వ్యక్తుల వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలియజేశారు. నూతన చట్టాల ద్వారా మహిళలకు పెద్దపీట వేయడం జరుగుతోందని అన్నారు. షీటీమ్ దాని ప్రాముఖ్యత, ఫోక్సో చట్టాలు, బాల్య వివాహాలు దాని యొక్క పరిణామాలు, ఇవిటీజింగ్, గుడ్ టచ్, బాడ్ టచ్ తదితర అంశాలపై వివరించారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెడ్మాస్టర్ జ్యోతి, ఉపాధ్యాయులు, హుస్నాబాద్ షీటీమ్ బృందం సదయ్య , హెడ్ కానిస్టేబుల్ ప్రశాంతి, కానిస్టేబుల్ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-సిద్దిపేటకలెక్టరేట్

తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం సిద్దిపేట జిల్లా నూతన సంవత్సర క్యాలెండర్‌ను జిల్లా కార్యదర్శి చెన్ను శ్రీనివాస్ రావు అధ్యక్షతన జిల్లా కలెక్టర్ మను చౌదరి జిల్లా కలెక్టరేట్‌లో గురువారం ఆవిష్కరించారు. అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసి కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేయడంలో గెజిటెడ్ అధికారుల పాత్ర ముఖ్యమైనదని తెలిపారు. ప్రభుత్వము అధికారుల పరస్పర సహకారంతో ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసి జిల్లాను మొదటి స్థానంలో వుంచాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్, అబ్దుల్ హమీద్ , పోలీస్ కమీషనర్ డా.అనురాధ, గెజిటెడ్ అధికారు పాల్గొన్నారు.

20వ వార్డులో కంటి పరీక్షలు



నవతెలంగాణ-సిద్దిపేట

మున్సిపల్‌లోని 20వ వార్డులో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు ఆదేశాల మేరకు పేదవారికి ఎల్‌వీ ప్రసాద్ ఆసుపత్రి వారితో ఉచిత నేత్ర పరీక్ష కార్యక్రమం నిర్వహించబడిందని బీఆర్ఎస్ వార్డు అధ్యక్షులు మహ్మద్ చాంద్ పాషా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు చెయ్యడం, వైద్యులు సూచనల మేరకు కంటి ఆపరేషన్ అవసరం ఉన్న వాళ్లకు కంటి ఆపరేషన్ చేసి మందులు, కళ్ల ఆద్దాలు ఉచితంగా పంపిణీ చేసి కంటికి సంబంధించి సూచనలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ తిరుమల్ రెడ్డి, నాగరాజు, గ్యాదారి రవీందర్, రాజక్, రియజ్, అసద్, యాకూబ్, అబిబు, పాల్గొన్నారు.

జిల్లాలోని అభివృద్ధి పనులపై సమీక్ష





నవతెలంగాణ-సిద్దిపేటకలెక్టరేట్

జిల్లాలో ఎన్ఆర్ఈజీఎస్, 15వ ఆర్థిక సంఘం ద్వారా వివిధ అభివృద్ధి పనుల కొరకు మంజూరై చేపట్టిన పనులపై గురువారం జిల్లా కలెక్టర్ ఎం. మనుచౌదరి కలెక్టరేట్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎన్.ఆర్.ఈ.జి.ఎస్ ద్వారా గ్రామపంచాయతీ, అంగన్‌వాడీ, సీసీ రోడ్డు తదితర పనులు చేపట్టారని, అనుమతులు పొందిన అంగన్ వాడీ భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. నిర్మాణ పనులకు భూ సమస్యలు ఉన్న వాటి వివరాలు అందించాలని, ఇంకా ప్రారంబించాల్సిన పనుల వివరాలు అందజేయాలన్నారు. పనులకు అదనంగా నిధులు అవసరమైతే వాటి వివరాలను తెలియజేయాలన్నారు. అదే విధంగా 15వ ఆర్థిక సంఘం ద్వారా చేపడుతున్న సబ్ సెంటర్ ల నిర్మాణాలను పూర్తి చేయాలని, పనుల పురోగతిని ప్రతివారం సమీక్షిస్తానని, అదే విధంగా అధికారులు కూడా క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని పర్యవేక్షించడంతో పాటు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. ఇప్పటికే కొన్ని నిర్మాణ పనులు ప్రారంభించగ వాటిని ఈ ఆర్థిక ఏడాది చివరిలోగా పూర్తి చేయాలని అదే విధంగా టెండర్ దశలో ఉన్న వాటిని త్వరగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి శారద, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి పల్వన్ కుమార్, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాస్, ఆయా శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణా కేంద్రాలతో మహిళలకు చేయూత

-నాబార్డ్ సీజీఎం ఉదయ్ భాస్కర్

నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్

ఉచిత శిక్షణ కేంద్రాలు మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ఎంతో ఉపయోగప డతాయని ఇట్టి అవకాశాన్ని సద్వినియోగ పరుచుకొని మహిళలు ఆర్థికంగా వృద్ధి చెందాలని నాబార్డు సీజీఎం ఉదయ్ భాస్కర్ అన్నారు. సిద్దిపేటలో యూనియన్ బ్యాంకు, ఆర్ సీటీ ఆధ్వర్యంలో సిద్దిపేటలో జరుగుతున్న మహిళల ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించి శిక్షణ తీసుకుంటున్న వారికి అవగాహన కల్పించారు. ఇటువంటి అవకాశాన్ని ఉపయోగించుకొని మహిళలు ఎదగడానికి బ్యాంకులు కూడా సహాయ సహకారాలు అందిస్తాయని లోన్స్ ద్వారా సొంత వ్యాపారం ఏర్పరచుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. ఇక్కడ శిక్షణ పొంది సమయాన్ని వృథా చేయకుండా వ్యాపారాలను నడుపుకోవాలని తెలిపారు. శిక్షణ తీసుకున్న వారికి సంస్థ నుంచి పరీక్ష నిర్వహించి సర్టిఫికెట్స్ జారీ చేయడం జరుగుతుందని తెలిపా రు.అనంతరం శిక్షణ కేంద్రంలో ఉన్న వస్తువులను పరిశీలించి విషయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాబార్డు డీడీఎం నిఖిల్, యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ వికా స్, ఆర్‌సీటీ డైరెక్టర్ రాజలింగం, ఫ్యాకల్టీ నజీమ్ అలీ, నాగరాజు, సిబ్బంది స్వప్న, ప్రశాంత్ పాల్గొన్నారు.



రబీ సీజన్‌కు ఎరువులు అందుబాటులో ఉన్నాయి

-మండల వ్యవసాయ శాఖ అధికారి బి. రామకృష్ణ.



నవతెలంగాణ-మద్దూరు

రైతులకు రబీ సీజన్‌కు సంబంధించి ఎరువులు అందుబాటులో ఉంచినట్లు మద్దూరు ఏవో రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని రేబర్తి సొసైటీ ఎరువుల విక్రయ కేంద్రాన్ని, మర్మములలో ఆగ్రోస్ రైతు సేవ కేంద్రం, మద్దూరు ఎరువుల దుకాణాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ యాసంగిలో 8530 ఎకరాల్లో వరి సాగు అంచనా వేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధికారులు ఉపేందర్, విజయ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి బియ్యం అందజేత



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు గ్రామానికి చెందిన నాగిళ్ల రాజయ్య ఇటీవలే ఆకస్మికంగా మృతి చెందాడు. పేద కుటుంబ పరిస్థితి తెలుసుకున్న నంగునూరు గ్రామ తాజా మాజీ సర్పంచ్ చౌడుచెర్ల మమత జయపాల్ రెడ్డి 50 కేజీల బియ్యాన్ని మృతుని కుటుంబానికి పంపించారు. ఆ బియ్యాన్ని కుల అధ్యక్షుడు దేవులపల్లి (పెర్మని) యాదయ్య, ఉపాధ్యక్షుడు దేవులపల్లి నర్సింగరావు, మాజీ వార్డు సభ్యులు, దేవులపల్లి శోభ కనకయ్య పాపి గారి నరేశ్, దేవులపల్లి గణేశ్ లు మృతుని కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవులపల్లి హరిబాబు, దేవులపల్లి కృష్ణ, దేవులపల్లి పెద్ద భూమయ్య, ఐలయ్య కనకయ్య రాజయ్య, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో ప్రైవేటుకు ధీటుగా తీర్చి దిద్దాలి

- విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ
- జిల్లా విద్యాశాఖాధికారి ఎల్లంకి శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-నంగునూరు

దాతల సహకారంతో ప్రయివేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్లంకి శ్రీనివాస్ రెడ్డి సూచించారు. గురువారం మండలంలోని నర్మెట ప్రాథమిక పాఠశాలలో సిద్దిపేట లోహిత్ సాయి కార్డియాక్ సెంటర్ డాక్టర్ భాస్కర్ ఆర్థిక సాయంతో వంద మంది విద్యార్థులకు రూ.55వేల విలువైన క్రీడాదుస్తులను పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎనగందుల మనీష్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీఈఓ మాట్లాడుతూ దాతల సహకారం ఇతర పాఠశాలలకు మార్గదర్శకం కావాలని తెలియజేశారు. దాత డాక్టర్ భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధతో చదువుకొని జీవితంలో గొప్ప స్థాయికి ఎదగాలని, కన్న తల్లిదండ్రుల కోరికలను నెరవేర్చి సమాజంలో మంచి పేరు, ప్రఖ్యాతులు గడించాలని తెలిపారు. మండల విద్యాశాఖాధికారి తగిరెడ్డి దేశిరెడ్డి, మాట్లాడిన అనంతరం భాస్కర్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎపీపీసీ చైర్మెన్ లింగంపల్లి రజితాకుమార్, ఉపాధ్యాయులు తహసీన్ సుల్తానా, ఎండీ. అర్షద్, బి. యాదగిరి, జె. సునీత జి. లలిత, ఎల్. శ్రావణ్, సీఆర్పీ పి. రేణుక, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను చితకబాదిన పీడీని సస్పెండ్ చేయాలి

- ఎఫ్డీసీ మాజీ చైర్మెన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



నవతెలంగాణ-కొండపాక

మండలంలోని దుద్దెడ సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులను చితకబాదిన పీడీ వాసును వెంటనే సస్పెండ్ చేయాలని ఎఫ్డీసీ మాజీ చైర్మెన్ బీఆర్ఎస్ నాయకుడు వంటేరు ప్రతాపరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం జరిగిన సంఘటన విషయం తెలుసుకొని ఆయన బీఆర్ఎస్ నాయకులతో కలిసి హాస్టల్‌ను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారికి తలిగిన దెబ్బలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషల్ వెల్ఫేర్ లో చదువుతున్న వారంతా పేద కుటుంబాలకు చెందిన వారేనని వారిని ప్రేమగా ఆప్యాయంగా చూసుకోవాల్సింది పోయి చితకబాదటం దారుణం అన్నారు. ఈ చర్యకు పాల్పడిన వాసు పై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నుంచి రెసిడెన్షియల్ స్కూళ్లలో విద్యార్థులకు స్వేచ్ఛ లేకుండా పోయిందన్నారు. తల్లిదండ్రులను కనీసం విద్యార్థులతో కలవనీయక పోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు నూనె కుమార్ యాదవ్, విద్యార్థి సంఘ నాయకులు ఉన్నారు.

పేద ప్రజల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి



నవతెలంగాణ-కొండపాక

పేద ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తుందని డీసీసీ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి అన్నారు. గురువారం కొండపాక మండలం దుద్దెడ శివారులో కలెక్టరేట్ నిర్మాణం సమయంలో భూములు కోల్పోయిన రైతులకు ఇళ్ల పట్టాల పంపిణీ, మండలంలోని దమ్మకపల్లి శివారులో కల్వర్టు నిర్మాణ పనులను డీసీసీబీ చైర్మెన్ చిట్టి దేవేందర్ రెడ్డి, హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ భూమిరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సౌకర్యం ప్రజా పాలన సాగుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కొండపాక మండల అధ్యక్షులు వాసరి లింగారావు , కుకునూరు పల్లి మండల అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి , మాజీఎంపీపీ మంచాల అనసూయ కనక రాములు , కొండపాక మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కొయ్యడ వెంకటేశం, తదితరులున్నారు.

ఇన్స్‌పైర్ అవార్డ్స్ ప్రదర్శనలో సిద్దిపేట జిల్లా సత్తా

- జిల్లా నుంచి జాతీయస్థాయికి ఒక ప్రదర్శన ఎంపిక



నవతెలంగాణ-గజ్వేల్/ సిద్దిపేట

మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్లలో జరుగుతున్న రాష్ట్రస్థాయి 52వ రాష్ట్ర స్థాయి బాల్ వైజ్ఞానిక్ ప్రదర్శిణి 2024-25 ఇన్స్పైర్ మానక్ -2024 ప్రదర్శనలో సిద్దిపేట జిల్లా నుంచి 18 ఇన్స్పైర్ ప్రదర్శనలను, 14 సైన్స్ ఫెయిర్ ప్రదర్శనలను , ఒకటి టీచర్ ఎగ్జిబిట్‌లో పాల్గొన్నారు. గజ్వేల్ మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అహమ్మదీపూర్, విద్యార్థి ఎస్ .వికాస్, గైడ్ టీచర్ హఫీజ్ సారథ్యంలో జాతీయ స్థాయికి ఎన్నిక కావడం జరిగింది. జాతీయ స్థాయికి ఎన్నికైన విద్యార్థులను ప్రశంసా పత్రాలతో మెమొంటోతో సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాసరెడ్డి , జిల్లా సైన్స్ అధికారి కల్లేపల్లి శ్రీనివాస్, అహ్మదీపూర్ పాఠశాల ప్రాధానోపాధ్యాయులు సుగుణకర్, ఎంఈఓ కృష్ణా జాతీయస్థాయికి ఎన్నికైన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

పాఠశాలకు గేటును బహుకరించిన మాజీ ఎంపీటీసీ



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల మండలం వీరన్నపేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆ గ్రామ మాజీ ఎంపీటీసీ ఎలికట్టె శివ శంకర్ గౌడ్ గురువారం రూ.60 వేల విలువ గల గేటును బహుకరించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశానికి ప్రధానోపాధ్యాయురాలు కోటగిరి ఎల్లమ్మ అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఉన్నత పాఠశాల ఆవరణ ప్రహరీకి ఇంత కాలం గేటు లేకపోవడం వల్ల పశువులు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా ఉండేదని శివశంకర్ గౌడ్ గేటు బహుకరించడం వల్ల పాఠశాలకు రక్షణ కల్పించిన వారయ్యారని అన్నారు. ఈ సందర్భంగా ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఏపీసీ చైర్ పర్సన్ అరిగె బాలమణి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి, భౌతిక వసతుల కల్పన లో శివశంకర్ గౌడ్ కృషి, ఔన్నత్యాన్ని అభినందించారు. పాఠశాల అభివృద్ధికి భౌతిక అవసరాలను సమకూర్చడంలో గ్రామస్తులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మధుసూదన్, ఉపాధ్యాయులు మొగుళ్ళ పద్మ, కొంగరి ప్రసాద్, బండ మల్లేశం, చవ్వ రాజయ్య, పెంటపర్తి కొండల్ రెడ్డి, రాసూరి శ్రీనివాస్, షభాన బేగం పాల్గొన్నారు.

పామ్ ఆయిల్ సాగుకు రైతులు ముందుకు రావాలి



నవతెలంగాణ-ములుగు

రాష్ట్ర ప్రభుత్వం పామ్ ఆయిల్ సాగుకు ప్రోత్సాహం అందిస్తుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పామ్ ఆయిల్ సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని సహాయ వ్యవసాయ సంచాలకులు అనిల్ కుమార్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సువర్ణ అన్నారు. గురువారం మండల కేంద్రమైన ములుగు రైతు వేదికలో పామ్ ఆయిల్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలో ఇప్పటి వరకు 12 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ పంటను సాగు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో 50 వేల ఎకరాల్లో పామ్ ఆయిల్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. సాగుకు జిల్లాలోని రైతులు ముందుకు రావాలని సూచించారు. జిల్లాలో పామ్ ఆయిల్ ఇండస్ట్రీ జూన్ నెలలో ప్రారంభమవుతుందని, ప్రారంభం నాటికి 20వేల ఎకరాల్లో పామ్ ఆయిల్ సాగు లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. ఏడాది 4వేల ఎకరాలు టార్గెట్ ఇస్తే 1000 ఎకరాల్లో పామ్ ఆయిల్‌ను సాగు చేయించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ అనిల్ కుమార్, ఏఓ ప్రగతి, ఏఈఓలు పృధ్వీరాజ్, అనూజ్ఞ, నివేదిత, మండల రైతులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సెన్సాఫ్ సెక్యూరిటీకి సీసీ కెమెరాలు చాలా ముఖ్యం

- తొగుట సీఐ ఎస్కే లతీఫ్, ఎస్సై రవికాంత్ రావు



నవతెలంగాణ-తొగుట

ప్రజల సెన్సాఫ్ సెక్యూరిటీకి సీసీ కెమెరాలు చాలా ముఖ్యమని తొగుట సీఐ ఎస్కే లతీఫ్, ఎస్సై రవికాంత్ రావు అన్నారు. గురువారం మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన తగరం నరసయ్య, మల్లేశం, రాములు ఇంటిలో ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సీసీ కెమెరాల వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని సీసీ కెమెరాలు ఉన్న గ్రామాల్లో, ఇండ్లలో ఎలాంటి కేసులు నమోదు కావడం లేదని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఏ చిన్న సంఘటన జరిగినా సీసీ కెమెరాల ద్వారా వెంటనే తెలుసుకోవచ్చన్నారు. సీసీ కెమెరాలు మరింత భద్రత, సెన్సాఫ్ సెక్యూరిటీ కల్పిస్తాయని తెలిపారు. రాత్రింబవళ్లు 24 గంటలు ప్రజలకు రక్షణగా నిలుస్తాయని సూచించారు. సీసీ కెమెరాలు ఉండి పని చెయ్యని గ్రామాలలో, సీసీ కెమెరాలు లేని గ్రామాల్లో ప్రజలు, ప్రజాప్రతినిధులు, సీసీ కెమెరాల ఏర్పాటుకు, రిపేర్ చేయడానికి పోలీసులకు సహకరించా లని కోరారు. ఈ కార్యక్రమంలో వీపిఓ, పోలీస్ సిబ్బంది, ఉన్నారు.

నవతెలంగాణ-దౌల్తాబాద్

సీసీ కెమెరాల ద్వారా శాంతిభద్రతల పరిరక్షణ నేరాల నియంత్రణ పకడ్బందీగా చేయవచ్చని సీసీ కెమెరాల నిఘా నీడలో సూరంపల్లి గ్రామం పర్యవేక్షించబడుతుందని తొగుట సిఐ షేక్ లతీఫ్ అన్నారు. గురువారం దౌల్తాబాద్ మండలం సూరంపల్లి గ్రామంలో సీసీ కెమెరాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా గ్రామంలో ప్రధాన కూడళ్లలో గ్రామ ప్రవేశ మార్గం, ముగింపు ప్రదేశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సీసీ కెమెరాలు ఉన్న గ్రామాల్లో ఎలాంటి కేసులు నమోదు కావడం లేదని, ఏ చిన్న సంఘటన జరిగినా సీసీ కెమెరాల ద్వారా వెంటనే తెలుసుకోవచ్చని సీసీ కెమెరాలు మరింత భద్రత, సెన్సాఫ్ సెక్యూరిటీ కల్పిస్తాయని తెలిపినారు. సీసీ కెమెరాలు ఉండి పని చెయ్యని గ్రామాలలో, సీసీ కెమెరాలు లేని గ్రామాల్లో ప్రజలు, ప్రజాప్రతినిధులు, వ్యాపారస్తులు, సీసీ కెమెరాల ఏర్పాటుకు పోలీసులకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దౌల్తాబాద్ ఎస్సై శ్రీరామ్ ప్రేమ్ దీప్, ఏఎస్ఐ, పోలీస్ సిబ్బంది, పాల్గొన్నారు.

అనారోగ్యంతో చేనేత కూలి మృతి



నవతెలంగాణ-దుబ్బాక

అనారోగ్యంతో బాధపడుతూ చేనేత కూలి మృతి చెందిన ఘటన దుబ్బాక పట్టణ కేంద్రంలోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయం వద్ద గురువారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు పట్టణంలో నిరుపేద కుటుంబానికి చెందిన స్వర్గం బాలయ్య (59) చేనేత పనిలో ఉపాధి లేకపోవడంతో పలు షాపులు,హెూటల్లలో దినసరి కూలిగా పని చేశాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీంతో గురువారం ఉదయం మరణించడంతో అంత్యక్రియల కోసం పలువురు దాతలు, సమాజ్ సుధార్ సమితి సభ్యులు మృతుని కుటుంబ సభ్యులకు ఆర్థిక సహకారం అందించారు. మృతునికి భార్యకొడుకు ఉన్నారు. దాతలుమానవతా దృక్పథంతో బాలయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని పద్మశాలి సమాజం అధ్యక్షులు జిందం గాలయ్య కోరారు.

కార్మిక సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి


- మున్సిపాలిటీ మాజీ చైర్మెన్ గాడి పల్లి భాస్కర్



నవతెలంగాణ-గజ్వేల్

కార్మిక సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుంది గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ మాజీ చైర్మెన్ గాడి పల్లి భాస్కర్ అన్నారు. గురువారం ఆయన ఇంటిలో మున్సిపాలిటీ కార్మికులకు దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలికాలం సందర్భంగా మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మిక సిబ్బంది, మహిళ, పురుషులకు దుస్తులు పంపిణీ చేశామన్నారు. గత ప్రభుత్వంలో కార్మికులకు జీతభత్యాలు కూడా ఇవ్వలేకపోయినట్లు గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తుందని తెలిపారు. గత ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ గజ్వేల్ నియోజకవర్గాన్ని పట్టించుకోలేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం వచ్చిన తర్వాత ప్రజాసంక్షేమంపై దృష్టి పెట్టినట్లు అన్నారు. పట్టణంలో బొడ్డురాయి నిర్మాణం, ఇందిరా పార్క్ నుండి కోట మైసమ్మ రోడ్డులో ఇండ్లను కోల్పోయిన వారికి ఇందిరమ్మ ఇండ్లతో న్యాయం చేస్తామన్నారు. రానున్న నాలుగు ఎండ్లల్లో గజ్వేల్ ను అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గాడి పల్లి శ్రీనివాస్, రామచంద్ర చారి, నరేష్, అనూఫ్ పాల్గొన్నారు.

నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎన్‌సీ సంతోష్



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ లో గురువారం సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌సీ సంతోష్ భారత్ ఖాదీ క్లాత్ స్టోర్ 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎన్‌సీ సంతోష్ మాట్లాడుతూ భారత్ ఖాదీ క్లాస్ స్టోర్ యజమాని నరేందర్ రెడ్డిని అభినందించారు. వినియోగదారుల మన్నన పొందుతూ మంచి గుర్తింపు తెచ్చుకున్న భారత్ ఖాదీ క్లాత్ స్టోర్ మంచి గుర్తింపు పొందిందని, యువత వ్యాపారంలో రాణించాలని ఉద్దేశంతో సొంతగా వ్యాపారాన్ని కొనసాగిస్తూ పదిమందికి ఉపాధి కల్పిస్తున్న నరేందర్ రెడ్డి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడన్నారు. ఈ కార్యక్రమంలో విష్ణువర్ధన్ రెడ్డి, ఆరిఫ్, బ్రాహ్మణపల్లి బిక్షపతి, బాలేష్, సతీష్,మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు విజయవంతం


- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి పూజల హరికృష్ణ



నవతెలంగాణ-సిద్దిపేట

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మహిళలకు సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీలు విజయవంతమైనట్లు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి పూజల హరికృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని మన సంస్కృతి సంప్రదాయాలను తెలిపే ముగ్గులను, సంక్రాంతి విశిష్టతలను తెలిపే విధంగా ముగ్గులు వేసినట్లు తెలిపారు. అనంతరం గెలుపొందిన మహిళలకు బహుమతులను అందించా రు. ఈ సందర్భంగా ఎన్ సీసీ విద్యార్థుల కు ఎలాంటి నిధులు ప్రభుత్వం కేటాయిం్తలేదని, జనవరి 26న పరేడ్‌లో భాగంగా అవసరమైన పరికరాలు, కావాల్సిన సామా గ్రి లేనందున పాల్గొన్న లేక పోతున్నా మని, కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నందున నిధులు ఇవ్వాలని ఎన్‌సీసీవిద్యార్థులు కోరారు. వెంటనే స్పందించిన పట్టణ అధ్యక్షుడు అత్తు_ఇమామ్ రూ.10వేలు అందిస్తానని హామీని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్‌ను కలిసిన కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బాలుర సముదాయమునకు స్వయం ప్రతిపత్తి హెూదా కలిగిన సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నిఖత్ అంజుం, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ వెంకటేష్, అకడమిక్ కోఆర్డినేటర్ కెప్టెన్ డాక్టర్ భవాని ఉస్మానియాలు గురువారం యూనివర్సిటీ రిజిస్ట్రేషన్ ప్రొఫెసర్ నరేష్ రెడ్డిని కలిసి అటానమస్ విషయాన్ని వివరించి తగిన సలహాలు కోరారు. సహకరించిన కమిషనరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్‌లోని మల్టి జోన్ టూ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాజేందర్ సింగ్, మల్టి జోన్ వన్ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ యాదగిరి, అకడమిక్ గైడెన్స్ ఆఫీసర్ ప్రొఫెసర్ బాల భాస్కర్‌లని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

రైతులను మోసం చేసిన ఘనత కాంగ్రెస్‌దే..

- ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్



నవతెలంగాణ-సిద్దిపేటరూరల్

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అధికారంలోకి వచ్చిన తర్వాత మా3ట మార్చి సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతులను మోసం చేసిందని మాజీ ఎంపీపీ ఒగ్గు బాలకృష్ణ అన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షులు కోనయ్య గారి ఎల్లయ్య ఆధ్వర్యంలో గురువారం నారాయణరావుపేట మండల కేంద్రంలో రైతులతో కలిసి బీఆర్ఎస్ నాయకులు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని మానవహారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారంలోకి రాకముందు రైతు భరోసా క్రింద ఏడాదికి ఎకరానికి రూ.15వేలు ఇస్తానని చెప్పి, ఇప్పుడు మాట మార్చి రూ.12వేలు మాత్రమే ఇస్తానని చెప్పడం సరికాదని అన్నారు. అదేవిధంగా సన్న రకం వడ్లకు రూ.500 బోనస్ ఇస్తానని బోగస్ చేశారని అన్నారు. ఇచ్చిన హామీలు నెరవే ర్చాలని బీఆర్ఎస్ నాయకులు ప్రజల పక్షాన రైతులు పక్షాన ఎమ్మార్వో ఎంపీడీవోకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎల్లారెడ్డి, మాజీ సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షులు ఆంజనే యులు, మాజీ ఎంపీటీసీ హరీష్, నాయకులు రైతులు, పాల్గొన్నారు.

బుగ్గ రాజేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మెన్‌గా కరుణాకర్

- నియామక పత్రం అందజేసిన పూజల హరికృష్ణ



నవతెలంగాణ-సిద్దిపేటరూరల్

నారాయణరావుపేట మండల కేంద్రం బుగ్గ రాజేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మెన్‌గా భాగన్న కరుణాకర్ నియమిస్తూ పాలకవర్గ సభ్యులను ప్రకటిస్తూ ప్రభుత్వం జీవోజారి చేసింది. గురువారం సిద్దిపేట పట్టణంలో కాంగ్రెస్ పార్టీ క్యాంప్ ఆఫీస్‌లో నియోజకవర్గ ఇన్చార్జి పూజల హరికృష్ణ ఆధ్వర్యంలో ఆలయ చైర్మెన్‌గా ఎన్నికైన భాగన్నగారి కరుణాకర్, సభ్యులుగా ఎన్నికైన బిట్ల శ్రీనివాస్, ఆకుల సంతోష్ కుమార్, రోమాల దేవయ్య, కుంభాల సరళ, బాలసాని ఉప్పలయ్య, సింగరి మహిపాల్ రెడ్డిలకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ నూతన సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. తమ ఎన్నికలకు సహకరించిన దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మంత్రి ప్రభాకర్ కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కష్టపడ్డా ప్రతి కార్యకర్తకు పదవులు లభిస్తాయన్నారు. భవిష్యత్తులో ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కష్టపడి పార్టీకి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా భాగన్న కరుణాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నాపై నమ్మకంతో ఆలయ చైర్మన్ గా నియమించినందుకు మంత్రి కొండ సురేఖ, నాకు సహకరించిన పూజల హరికృష్ణకు, నారాయణరావుపేట కాంగ్రెస్ నాయకులకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.

గ్రంథాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన చైర్మెన్



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ పట్టణంలో గ్రంథాలయాన్ని గురువారం రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రియాజ్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. తనిఖీలో భాగంగా రికార్డులను పరిశీలించారు. గ్రంథాలయంలో పుస్తకాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చైర్మెన్ రియాజ్‌ను శాలువాతో లైబ్రేరియన్ తిరుపతిరెడ్డి ఘనంగా సన్మానించారు.

పీడీపై కఠిన చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-కొండపాక

స్టడీ అవర్స్‌కు ఆలస్యంగా వచ్చారని విద్యార్థులను చితకబాదిన ఫిజికల్ డైరెక్టర్‌పై కఠిన చర్యలు టీడీబీఎస్ జిల్లా అధ్యక్షుడు డబ్బేట కృష్ణ తెలిపారు. సోమవారం పలువురి నాయకులతో కలిసి కుక్కునూరు పల్లి మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ దుద్దెడ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మంగళవారం పలువురు విద్యార్థులు స్టడీ వరకు ఆలస్యంగా వచ్చారని వారిపై ఇష్టారీతిగా ఫిజికల్ డైరెక్టర్ వాసు ప్రతాపం చూపించాడు. కర్రతో ఇష్టం వచ్చినట్టు వారిని చితకబాదాడనీ, పిల్లలకి చదువు చెప్పాల్సిన ఉపాధ్యాయులు వారి శరీరాలపై గాయాలు పరుస్తూ వారిని ఇబ్బందికి గురిచే పిడి పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీజీపీఏ జిల్లా అధ్యక్షులు తాడెం దశరథం, కుమారస్వామి రాజు లింగం తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
5
శుక్రవారం | 10 జనవరి 2025 | www.navatelangana.com

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు పూర్వ విద్యార్థుల ఆర్థిక సహకారం



నవతెలంగాణ-సిద్ధిపేట

ప్రభుత్వ డిగ్రీ కళాశాల(స్వయం ప్రతిపత్తి)కు పూర్వ విద్యార్థులు ఉప్పల నరసయ్య (జీహెచ్ఎంసి రిటైర్డ్ ఉద్యోగి) రూ.5 లక్షలు, ఆర్ఎంసి ప్యాకేజింగ్ సంస్థల అధినేత అబ్బ మల్లారెడ్డి రూ. లక్ష విరాళంగా చెక్కులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సునీతకి అందజేశారు. అనంతరం కార్యనిర్వాహక సభ్యులు మార్క గణేష్ , సి.హెచ్ హరిచంద్ర, ఎం మహిపాల్ రెడ్డి, పి సత్యనారాయణ, బి.నర్సయ్య, జి రమేష్‌లు కళాశాల అభివృద్ధికి సహకరిస్తున్న వీరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ, అందరిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డా.పి అయోధ్య రెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ గోపాల సుదర్శనం, ఐక్య కోఆర్డినేటర్ డాక్టర్ మధుసూదన్, డాక్టర్ లీలావతి, డాక్టర్ ఉమామహేశ్వరి, సూపరింటెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పలు పాఠశాలలను సందర్శించిన ఎంఈఓ



నవతెలంగాణ-కొండపాక

కుకునూరుపల్లి మండలంలోని పలు పాఠశాలలను మండల విద్యాశాఖ అధికారి బచ్చలి సత్తయ్య గురువారం సందర్శించారు. మండలంలోని చిన్న కిస్టాపూర్, ఎల్లాయగూడా గ్రామాల ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు అన్ని అంశాల్లో విజ్ఞానం పెంపొందేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. మధ్యాహ్న భోజనాన్ని నాణ్యతతో అందివ్వాలని తెలిపారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులున్నారు.

ఫుట్బాల్ ఛాంపియన్ షిప్ పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-సిద్ధిపేట

సిద్ధిపేట ఫుట్బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి14 వరకు నిర్వహించే ఇంటర్ డిస్ట్రిక్ట్ స్కూల్ ఫుట్బాల్ ఛాంపియన్ షిప్ వాల్ పోస్టర్‌ను గురువారం సిద్ధిపేట అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ ఫుట్బాల్ టీమ్స్ కి ఆల్ ది బెస్ట్ చెప్పారు. అనంతరం సిద్ధిపేట ఫుట్బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, కోచ్ అక్బర్ నవాబ్ మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే టోర్నమెంట్ లో దాదాపు 20 స్కూల్ టీం లు భాగస్వాములు కానున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ హరీశ్, జాయింట్ సెక్రటరీ సాజిద్ పాల్గొన్నారు.

అటవీ కళాశాలలో ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-ములుగు

ములుగు మండల కేంద్రంలోని అటవీ కళాశాల, పరిశోధన సంస్థ (ఎఫ్.సీ.ఆర్.ఐ) లో ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డా. ఎన్.శ్రీనిధి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అటవీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, లయన్స్ క్లబ్, హైదరాబాద్‌ల ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో ఉచితంగా నేత్ర పరీక్షలు, రక్త నమూనా పరీక్షలు నిర్వహించారు. అనంతరం అందరూ రక్త దానం చేశారు. ఈ శిబిరంలో కళాశాల జాయింట్ డైరెక్టర్ పి.శ్రీనివాస్ రావు, డిప్యూటీ డైరెక్టర్ కవిత, ఫిజికల్ డైరెక్టర్ ఉపేంద్ర, పీఈటీ నరేష్, కళాశాల అధ్యాపకులు, నాన్ టీచింగ్ సిబ్బంది వంద మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు.

పరీక్షల సమయంలో మానసిక ఒత్తిడికి గురి కావొద్దు

నవతెలంగాణ-కొండపాక

పరీక్షల సమయంలో మానసిక ఒత్తిడికి గురి కావద్దని కొండపాక ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ హరి ప్రసాద్ నాయుడు కళాశాల స్టూడెంట్ కౌన్సిలర్‌లు రాములు, హిమబిందు అన్నారు. గురువారం కళాశాలలో హార్ట్ ఫుల్ నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు ప్రభుత్వం క్రమం తప్పకుండా హాజరై మంచి ఫలితాలు సాధించాలన్నారు. విద్యార్థులు చదువును అశ్రద్ధ చేసి అనేక రకాల చెడు వ్యసనాలకు గురికా వద్దన్నారు . పరీక్షల సమయంలో విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా ఉండాలి అంటే అధ్యాపకులు చెప్పినటువంటి యోగా, ధ్యానం క్రీడలు, పాఠాలను క్రమ పద్ధతులు చదువుతూ సమయపాలన పాటిస్తూ సమయస్ఫూర్తితో ఎలాంటి సమస్యనైనా ఒత్తిడికి గురి కాకుండా ఎదుర్కొనే ధైర్యం ఉండాలన్నారు. ఈ కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వి అమరేందర్ రెడ్డి సహకారంతో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు కే శ్రీనివాస్, కే శశిధర్ రెడ్డి, శ్రీ లీల , వెంకన్న, అనిత సత్యనారాయణ, శివ ప్రసాద్, పద్మ విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత



నవతెలంగాణ-మర్కుక్

మండలంలోని పాములపర్తి గ్రామానికి చెందిన లెంకల కిష్టవ్వకు రూ.37,500 సీఎం సహాయ నిధి చెక్కును మర్కుక్ మాజీ ఎంపీపీ పాండు గౌడ్ అందజేశారు.

సురక్ష రైతు ఉత్పత్తిదారుల కంపెనీ సందర్శన



నవతెలంగాణ-ములుగు

సురక్ష రైతు ఉత్పత్తిదారుల కంపెనీని నాబార్డ్ సీజీఎం ఉదయ భాస్కర్ గురువారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ సురక్ష ఆర్గానిక్ ఉత్పత్తులు సొంత బ్రాండ్‌తో ప్యాకింగ్ చేసి ఆన్లైన్లో మార్కెటింగ్ అపార్ట్ మెంట్స్ వారికి అమ్మకాలు చేయాలని తెలియజేయడం జరిగింది. సంస్థ యొక్క మూలధనం పెంచుకోవాలని, వివిధ వ్యవసాయ అనుబంధ శాఖలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఖేతి సంస్థ ద్వారా వేయించిన నెట్ హౌస్ లు ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాబార్డ్ డీడీఎం లు కృష్ణ తేజ , నిఖిల్ రెడ్డి, సిఎస్‌ఏ సంస్థ శ్రీశైలం, ఖేతి సంస్థ నుంచి విష్ణు , భరద్వాజ్ , సాయి కృష్ణ, సురక్ష డైరెక్టర్‌లు, రైతులు పాల్గొన్నారు.

ప్రజా సేవే తమ లక్ష్యం



నవతెలంగాణ-మర్కుక్

ప్రజా సేవే తమ లక్ష్యమని మండల పరిధిలోని పాతూరు గ్రామానికి యువ నాయకులు బుర్జుకింది శ్రీనివాస్ అన్నారు. గురువారం ఆయన గ్రామంలో ప్రతి ఇంటికి వాటర్ క్యాన్లను అందజేశారు. గ్రామంలో సామాజిక చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. చిన్నబాల కనకయ్య, బూకల అంజనేయులు, మంద యాదయ్య, చిన్న బాలరాజు, పుట్ట రవి, పిట్ల కనకయ్య, ప్రభాకర్, బోయిని కుమార్, నర్సింలు, ఉన్నారు.

ఒలంపియాడ్‌లో మాడ్యులస్ విద్యార్థుల ఘనత



నవతెలంగాణ-సిద్ధిపేట

స్థానిక మాడ్యులస్ పాఠశాల విద్యార్థులు గత ఏడాది అక్టోబర్ 26న జరిగిన ఆదిత్య బిర్లా వారు నిర్వహించిన మ్యాథమెటిక్స్ ఇంటర్నేషనల్ ఒలంపియాడ్ ప్రతిభా పరీక్షల్లో లెవెల్ వన్‌లో దేశంలోనే 34వ స్థానాన్ని అందుకొని, ఫైనల్ లెవల్‌కు అర్హత సాధించారు. ఈ సందర్భంగా ప్రతిభ పరీక్షల నిర్వాహకులు వారిని ముంబైలోని లోటస్ పాలస్‌లో అభినందించారు. జాతీయస్థాయిలో అలమా అబాకస్ వారు నిర్వహించే అబాకస్ పోటీ పరీక్షలలో ఐదవ తరగతికి చెందిన గరిపల్లి సతీష్ అంతర్జాతీయ స్థాయి పోటీలలో లెవెల్ 3 లో ప్రథమ స్థానాన్ని పొందారు. ఈ సందర్భంగా నిర్వాహకులు విద్యార్థి సతీష్‌కు మెమొంటో మరియు సర్టిఫికెట్ ప్రధానం చేశారు. ఇంతటి ఘనతను సాధించిన పాఠశాల విద్యార్థులను ప్రిన్సిపల్ జ్యోతి రెడ్డి, ఇంచార్జ్ అల్లాభక్షు, ఉపాధ్యాయ బృందం విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

హుషారుగా సీఎం క్రికెట్ కప్పు



నవతెలంగాణ-సిద్ధిపేట

సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన సందర్భంగా ప్రారంభమైన క్రికెట్ పోటీలు గురువారం స్థానిక ప్రొఫెసర్ జయశంకర్ మినీ స్టేడియంలో గడ్డం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో హుషారుగా సాగాయి. చిన్నకోడూర్, సికింద్లపూర్ జట్లు తలపడగా, చిన్నకోడూరు గెలుపొందగా, ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ రాజుకు, రెండవ మ్యాచ్ అల్లీపూర్, బుస్సాపూర్ జట్ల మధ్య జరుగగా బుస్సాపూర్ గెలవగా, ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ రజనీకాంత్ రెడ్డి అందుకున్నారు. మూడవ మ్యాచ్ రాముని పట్ల, పొన్నాల జట్ల మధ్య జరుగగా పొన్నాల గెలవగా, ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ కేకేఆర్‌కు, నాలుగో మ్యాచ్ మూన్ స్టార్, అల్లుతే టీం జట్ల మధ్య జరుగగా మూన్ స్టార్ గెలవగా, ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ ఎండి నసీరుద్దీన్ దక్కిం చుకున్నారు. ఈ కార్యక్రమాకి సిద్ధిపేట కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు అత్తు ఇమామ్, స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ సాకి ఆనంద్, తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ సిద్ధిపేట జిల్లా అధ్యక్షులు చెంది రెడ్డి నరేందర్ రెడ్డి, శివకుమార్ రెడ్డి, నరేష్ పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల్లో అవకతవకలు

- మండిపడ్డ అడిషనల్ డీఆర్‌డీఓ
- అవకతవకలపై రికవరీకి ఆదేశం



నవతెలంగాణ-మద్దూరు

మద్దూరు, దూల్మిట్ట, మండలాల్లో 2023-24 ఏడాదిలో ఉపాధి హామీ చట్టంలో జరిగిన పనుల్లో అనేక అవకతవకలు ఉన్నాయని, అవకతవకలు పాల్పడ్డ వారి నుంచి వెంటనే రికవరీ చేయాలని సిద్ధిపేట అడిషనల్ డీఆర్‌డీఓ బాలకృష్ణ, అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మద్దూరు మండల పరిషత్ కార్యాలయంలో 16వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఉపాధి హామీ చట్టంలో జరిగిన పనులపై ప్రజావేదిక నిర్వహించారు ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టంలో జరిగిన పని ప్రదేశాల్లో వర్క్ ఐడి తెలిపే బోర్డులను పాతించకపోవడంపై మండిపడ్డారు. వెంటనే వారి నుంచి డబ్బులు రికవరీ చేయాలని ఆదేశించారు. పనులు నిర్వహించకున్నా నిర్వహించినట్లు రికార్డుల్లో నమోదు చేయడం ఏంటని ఉపాధి హామీ సిబ్బందిని నిలదీశారు. పని ప్రదేశాల్లో చేపట్టిన పనులకు కొలతలు తీసుకోవడం లో నిర్లక్ష్యం కన్పించిందన్నారు. జాబ్ కార్డులు అప్డేట్ చేయకపోవడంతో పాటు రికార్డులు అప్డేట్ లేకపోవడంపై మండిపడ్డారు. పాత బోర్డులను చూపించడంతో పాటు ఉన్న భూమికంటే ఎక్కువ కొలతలు రికార్డు చేయడమేంటని ప్రశ్నించారు. ఎఫ్ఎ పరిధిలో 37 మంది మేట్లు ఉండటంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. కూలీలకు పే స్లిప్పులు ఇవ్వకపోవడంతో పాటు పనికిరాకున్నా వచ్చినట్లు చూపి డబ్బులు పేమెంట్ చేయడం చోటు చేసుకోవడంపై ఉపాధి హామీ సిబ్బందిని మందలిం చారు. ఈ కార్యక్రమంలో క్యూసి సంతోష్ ఏపీడీ శ్రీనివాస్ గౌడ్, ఎంపీడీవో రామ్మోహన్, ఎస్ఆర్పీ రమేష్, పిఆర్ఎఈ వినయ్ కుమార్ రెడ్డి, ఈసీ పర్శరాములు, టీఏలు, డీఆర్పీలు, పీఆర్పీలు, కార్యదర్శులు, పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి సహకరిస్తున్న దాతలకు అభినందనలు

-మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ రెడ్డి



నవతెలంగాణ-రాయపోల్

ప్రభుత్వ పాఠశాలలో విద్యాభివృద్ధికి సహకరిస్తున్న దాతలకు ప్రత్యేకంగా అభినందనలు తెలియ జేస్తున్నామని, వారి సహకారం ఇలాగే కొనసాగి విద్యార్థుల భవిష్య త్తుకు నాంది పలకాలని రాయపోల్ మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని అనాజీపూర్ ప్రాథమిక పాఠశాలకు 25 డెస్కులు, రామారం ప్రాథమిక పాఠశాలకు 30 డెస్కులు సికింద్రాబాద్ రోటరీ క్లబ్ విక్రమ్ మెహత, బేగంపేట సత్యసాయి సేవా సమితి కేవిఎస్. సాయికుమార్ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పూర్తిస్థాయిలో వసతులు కల్పిస్తే ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాల కంటే దీటుగా ఫలితాలు సాధిస్తామని తెలిపారు. ఈ డెస్కులు రెండు పాఠశాలలకు బహూకరించడంలో ముఖ్యపాత్ర పోషించిన రాయపోల్ గణిత ఉపాధ్యాయులు జి. తులసీదాస్ అలాగే దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మేరీ నిర్మల, రెండు ప్రాథమిక పాఠశాలల ప్రధానోపా ధ్యాయులు వి.నర్సింలు, హరిహర ప్రసాద్, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించి గమ్యస్థానాలకు చేరుకోవాలి





నవతెలంగాణ-చేర్యాల

రహదారి భద్రత నియమాలను పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని చేర్యాల మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ క్రిస్టోఫర్ వాహనాలను నడిపే వారికి సూచించా రు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని మోటార్ వెహికల్ కార్యా లయం ఎదుట వాహనదారులచే ఇన్స్పెక్టర్ ప్రతిజ్ఞ చేయిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపవద్దన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారు హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీటు బెల్టు తప్పనిసరిగా పెట్టుకోవాలని, అతివేగం ప్రమాదకరం అని అన్నారు . ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ జితేందర్ రెడ్డి, కానిస్టేబుల్ విక్టోరియా,హోం గార్డ్ నరేష్, కంప్యూటర్ ఆపరేటర్ రాకేష్ పాల్గొన్నారు.

నవతెలంగాణ-వర్గల్

మండలంలోని మజీద్ పల్లి గ్రామంలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా తొగుట సీఐ లతీఫ్, బేగంపేట ఎస్సై మహిపాల్ రెడ్డిలు మాట్లాడుతూ.. రోడ్డు భద్రత గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని అన్నారు. రోడ్డు భద్రత గురించి తెలుసుకున్నట్లైతే ప్రమాదాలను జరగకుండా నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్, ఉపాధ్యాయ బృందం, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

టీవైఆర్ ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయం

- ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్

ప్రభుత్వ పాఠశాలల్లో గ్రంథాలయాల ఏర్పాటుకు టీవైఆర్ ఫౌండేషన్ ముందుకు రావడం ప్రశంసనీయమని ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి పేర్కొన్నారు. గురువారం గజ్వేల్‌లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరై చైర్మెన్, ప్రముఖ న్యాయవాది తలకొక్కుల రాజుతో కలిసి ఆయన ప్రసంగించారు. గత రెండు దశాబ్దాలుగా సామాజిక సేవలు విస్తృతం చేసిన టీవైఆర్ ఫౌండేషన్ రాష్ట్ర, జాతీయస్థాయిలో గుర్తింపు దక్కించుకున్నట్లు స్పష్టం చేశారు. ఈ గ్రామీణ లైబ్రరీలతో పోటీ పరీక్షలు, ఉన్నత విద్య, వివిధ కోర్సులు, ఉద్యోగ నోటిఫికేషన్లు, గ్రూప్ పరీక్షలు, నూతన సాంకేతిక పరిజ్ఞానం తదితర ప్రపంచస్థాయి అంశాల పట్ల గ్రామీణ విద్యార్థులకు అవగాహన కలుగుతుందని తెలిపారు. గ్రామీణ విద్యార్థులు, నిరుద్యో నిరుద్యోగ యువతకు సంస్థ చైర్మెన్ రాజు అందిస్తున్న సేవలు కొనియాడ దగినవని అన్నారు. రాజు మాట్లాడుతూ తాను ఏర్పాటు చేసిన విజ్ఞాన కేంద్రంలో హైటెక్ టెక్నాలజీతో అన్ని రకాల వసతులు అందుబాటులోకి తెస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్, మున్సిపల్ వైస్ చైర్మెన్ జకీయొద్దిన్, ప్రభావతి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మాటలతో కాలం గడుపుతున్న కాంగ్రెస్

- గజ్వేల్ డివిజన్ ఆత్మ కమిటీ మాజీ చైర్మెన్ ఊడెం కృష్ణారెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్

ఏడాదికాలంగా కాంగ్రెస్ మాటలతోనే కాలం గడుపుతుంది తప్ప ఇచ్చిన హామీల విషయంలో మాట్లాడడం లేదని గజ్వేల్ డివిజన్ ఆత్మ కమిటీ మాజీ చైర్మెన్ ఊడెం కృష్ణారెడ్డి అన్నారు. గురువారం గజ్వేల్‌లో ఆయన మాట్లాడు తూ గజ్వేల్ నియోజకవర్గంలో అనేక సమస్యలు ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. గత ప్రభుత్వంలో కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలను అమలు చేయడం లేదన్నారు. అంతేకాకుండా నియోజకవర్గంలో రూ.కోట్లాది అభివృద్ధి పనులు పెండింగ్లో ఉన్నాయని వాటిని పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. కేసులపే రుట కాంగ్రెస్ డ్రామాలు ఆడుతుందని కేటీఆర్‌ను జైల్లో పెట్టించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందన్నారు. ప్రజా సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి పెట్టాలని విజ్ఞప్తి చేశారు. ఆరు గ్యారంటీల్లో కేవలం బస్సు ప్రయాణం మినహా ఏ పథకం పూర్తిస్థాయిలో అమలు కాలేదన్నారు.

కేటీఆర్ నిస్సిగ్గుగా మాట్లాడుతున్నారు

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సారంగుల అమర్నాథ్



నవతెలంగాణ-సిద్ధిపేట

ఫార్ములా-ఈ రేస్ కేసులో కేటీఆర్ నిస్సిగ్గుగా మాట్లాడుతున్నారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సారంగుల అమర్నాథ్ అన్నారు. గురువారం జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్ రెడ్డితో కలిసి పార్టీ కార్యాలయంలో జిల్లాలోని 21 మండలాలకు నూతన అధ్యక్షులను ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేటీఆర్‌పై ఈడి కేసు నమోదు చేశాక భయపడుతున్నాడన్నారు. తప్పు చేయకపోతే భయమెందుకని ప్రశ్నించారు. పదేళ్ల పాలించిన కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి పాలనలో అవినీతి తప్ప అభివృద్ధి లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఏ కేసులో కూడా ఎవరిని అరెస్టు చేయకుండా సీఎం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నాడని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అవినీతి చేసిన వారిని జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు విద్యాసాగర్, విభీషణ రెడ్డి, గోనె మార్కండేయులు, కుడిక్యాల రాములు, ప్రసాద్, సునీల్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌పై అక్రమ కేసు పెట్టడం అప్రజాస్వామికం

- బీఆర్ఎస్ సిద్ధిపేట పట్టణ అధ్యక్షులు కొండం సంపత్ రెడ్డి



నవతెలంగాణ-సిద్ధిపేట

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అక్రమ కేసులు బనాయించడం పూర్తిగా అప్రజాస్వామికమని ఆ పార్టీ సిద్ధిపేట పట్టణ అధ్యక్షులు కొండం సంపత్ రెడ్డి అన్నారు. గురువారం విలేకరులతో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. కేటీఆర్ పై నమోదు చేసిన కేసులో ఏమీ లేదని మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ ప్రెస్ నోట్ రిలీజ్ చేశారని గుర్తు చేశారు. కేటీఆర్ వెంట తన లాయర్ విచారణకు హాజరైతే వారికి వచ్చే నష్టం ఏంటో చెప్పాలన్నారు. గతంలో తమ పార్టీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి లాయర్ ను తీసుకెళ్లకుండా విచారణకు వెళ్తే, ఒప్పుకోనివి కూడా ఒప్పుకున్నట్లు అభియోగాలు మోపారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా ఇలాంటి పనికిమాలిన చర్యలు మానుకోవాలని, రాజ్యాంగబద్ధంగా పరిపాలన కొనసాగిం చాలని హితవు పలికారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు సతీష్, ప్రభాకర్ రెడ్డి, మోహిజ్, భానుచందర్ గౌడ్, సయ్యద్, కుమార్ పలువురు పాల్గొన్నారు.

మృతుడు పోచంరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన నేతలు





నవతెలంగాణ-మర్కుక్

మండల కేంద్రమైన మర్కుక్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు సాయిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ,బీజేపీ మర్కుక్ మండలాధ్యక్షులు సాయిరెడ్డి రాంరెడ్డి ,బీజేపీ నాయకులు సాయిరెడ్డి శంకర్ రెడ్డిల తండ్రి పోచంరెడ్డి, ఇటీవల మృతి చెందాడు. గురువారం మండల కేంద్రమైన మర్కుక్ లోని తమ స్వగృహంలో ద్వాదశ దినకర్మ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే ,కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు తూకుంట నర్సారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి మోహన్ రెడ్డి, ఎఫ్డీసీ మాజీ చైర్మెన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు సింగం సత్తయ్య, బీఆర్ఎస్ మర్కుక్ మండలాధ్యక్షులు మర్కుక్ కరుణాకర్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు బబ్బూరి మల్లేశం గౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షులు తాండ కనకయ్య గౌడ్ లు హాజరై ఆయన చిత్ర పటానికి పూలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మర్కుక్ గ్రామాధ్యక్షులు సాయిరెడ్డి జితేందర్ రెడ్డి, నాయకులు పత్తి నర్సింలు, వనం అంజనేయులు, శ్యాంప్రసాద్ గౌడ్, రవిగౌడ్, మాజీ సర్పంచులు అచ్చంగారి భాస్కర్, కర్రోళ్ల నర్సింలు, గడ్డం ప్రసాద్, తదితరులున్నారు.

ఉపాధ్యాయుల సేవలు మరువలేనివి

- దౌల్తాబాద్ విద్యాశాఖ అధికారి గజ్జల కనకరాజు



నవతెలంగాణ-దౌల్తాబాద్

ఉపాధ్యాయుల సేవలు పాఠశాలలో మరువలేనివని దౌల్తాబాద్ విద్యాశాఖ అధికారి గజ్జల కనకరాజు అన్నారు. గురువారం మండలంలోని తిరుమలపూర్ ప్రాథమిక పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు ప్రస్తుత ఉపాధ్యాయులు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండల విద్యాశాఖ అధికారి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి బదిలీలు తప్పనిసరిగా ఉంటాయన్నారు. ఈ పాఠశాలలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న శ్రీనివాస్, అనిల్ కుమార్, మల్లేశం ఉపాధ్యాయుల సేవలు ఎనలేనివన్నారు. అలాగే నూతనంగా పాఠశాలకు బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలియజేశారు. గజ్జల కనకరాజును పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యా యులు ప్రశాంత్, గోపాల్, వెన్నెల, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్ పర్సన్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో బీజేపీ మండలాల నూతన అధ్యక్షుల ఎంపిక







నవతెలంగాణ-రాయపోల్

రాయపోల్, దౌల్తా బాద్ మండలాలకు బీజేపీ నూతన అధ్యక్షులను ఎన్నుకోవడం జరిగింది. రాయపోల్ బీజేపీ మండల అధ్యక్షులుగా మంకిడి స్వామి, దౌల్తాబాద్ బీజేపీ మండల అధ్యక్షులుగా దేవుడి లావణ్య నియామకమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధ్యక్షులుగా ఎన్నుకున్నందుకు మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు, సిద్ధిపేట జిల్లా అధ్యక్షులు గంగాడి మోహన్ రెడ్డి, జిల్లా ఎన్నికల అధికారి రాష్ట్ర అధికార ప్రతినిధి అమర్నాథ్ సారంగుల, నాయకులకు కార్యకర్తలకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. పార్టీ కార్యక్రమాలను పార్టీ ఆదేశించిన బాధ్యతలను శిరసావహిస్థామని తెలియజేస్తున్నామన్నారు.

అక్కన్నపేట మండలాధ్యక్షులుగా మహేందర్ రెడ్డి

నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండల బీజేపీ మండలాధ్యక్షుడుగా రామంచ మహేందర్ రెడ్డి రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తనను ఏకగ్రీవంగా ఎన్నిక చేసిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, సిద్ధిపేట జిల్లా అధ్యక్షుడు గంగడి మోహన్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రాంగోపాల్‌కి కృతజ్ఞతలు తెలియజేశారు. రాబోవు రోజు ల్లో మండలం లో పార్టీని మరింత బలోపేతం చేస్తానని అన్నారు.

గజ్వేల్ మండల అధ్యక్షులుగా అశోక్ గౌడ్



నవతెలంగాణ-గజ్వేల్

సిద్ధిపేట జిల్లా కార్యాలయంలో వివిధ మండల అధ్యక్షులను బీజేపీ జిల్లా ఎన్నికల అధికారి అమర్నాథ్ ప్రకటించారు. గురువారం బీజేపీ గజ్వేల్ మండల అధ్యక్షుడిగ రెండోసారి పంజా అశోక్ గౌడ్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండవసారి అవకాశం కల్పించిన మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు, జిల్లా అధ్యక్షులు మోహన్ రెడ్డి, మండల సీనియర్ నాయకు లు రాష్ట్ర నాయకులు జశ్వంత్ రెడ్డి, మండల ఇన్చార్జి నందన్ గౌడ్, జిల్లా కార్యదర్శి కుడిక్యాల రాములు మండల సీనియర్ నాయకులకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

అజ్ఞానాన్ని చీల్చిన జ్ఞాన కిరణం ఫాతిమా షేక్

- డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి



నవతెలంగాణ-గజ్వేల్‌రూరల్

భారతదేశం మొట్టమొదటి ముస్లిం ఉపాధ్యాయురాలు, శూద్రులు, మహిళల విద్య కోసం తన జీవితాంతం పోరాడిన మాతా ఫాతిమా షేక్, జాతిపిత జ్యోతిబా పూలే తల్లి సావిత్రీబాయి పూలే సహచరులు మాతా ఫాతిమా షేక్ 194 వ జయంతొత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవడం సంతోషంగా ఉందని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి అన్నారు. గురువారం సంగాపూర్ గ్రామంలోని జెహెచ్ ఆర్ హై స్కూల్ పాఠశాలలో విద్యార్థుల సమక్షంలో డీబీఎఫ్ అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్రవర్ణ సమాజం నుండి ఎన్ని అవమానాలు, ఎన్ని బెదిరింపులు, ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా మొక్కవోని ధైర్యంతో సమాజ సంస్కరణ కోసం పాటుపడ్డారన్నారు. సావిత్రి బాయితో కలిసి జ్యోతీరావు పూలే దగ్గరే ఆమె చదువు నేర్చుకున్నారు. పూలే దంపతులు గృహ బహిష్కరణకు గురైనప్పుడు వారికి ఆశ్రయం కల్పించి ఆదుకున్నారన్నారు. 1851 లో ఆమె స్వయంగా ముంబైలో రెండు పాఠశాలలు స్థాపించారన్నారు. దళితుల ఇళ్లకు వెళ్ళి పిల్లల చదువు విషయంలో వారిని చైతన్య పరిచారన్నారు. గంటలు గంటలు సమయం వెచ్చించి వారికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారన్నారు. మహిళలకు విద్య ఆవశ్యకతను వివరించి వారిలో జ్ఞాన జ్యోతులు వెలిగించారన్నారన్నారు. సావిత్రిపూలే, జ్యోతిబా పూలే లతో కలసి ఫాతిమా విద్యావ్యాప్తితో పాటు, అనేక సేవా కార్యకలాపాల్లో పాల్గొనరన్నారు. ఈ కార్యక్రమంలో జెహెచ్ఆర్ హై స్కూల్ ప్రిన్సిపాల్, డీబీఎఫ్ మండల అధ్యక్షులు ఊశగారి చంద్రం, ఖాదర్, తదుతరులు పాల్గొన్నారు.

రైతు చనిపోతే అంత్యక్రియలకు రూ.20 వేలు ఇవ్వాలి

- ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షులు శ్రీనివాస్



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

ఏ కారణం చేతనైనా రైతులు చనిపోతే అంత్యక్రియలకు రూ.20వేలను సహకార సంఘాల ద్వారా ఇవ్వాలని ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షులు పోన్నబోయిన శ్రీనివాస్ ఒక ప్రకటన కోరారు. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగి మరణించినపుడు అంత్యక్రియలకు చార్జీలు ఇచ్చినట్టుగా రైతు మరణిస్తే రైతుకు కూడా అంత్యక్రియల చార్జీలు ఇవ్వాలన్నారు. అలాగే రాష్ట్రంలో ఉన్నటువంటి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో పట్టా పాస్ బుక్ కలిగి ఉన్న ప్రతి రైతుకు సభ్యత్వం ఇవ్వాలన్నారు. ఇన్సూరెన్స్ కల్పించి ఏ కారణం చేతనైన రైతు మరణిస్తే ఆ సొసైటీ ద్వారా ఆ రైతు అంత్యక్రియలకు రైతు భీమా కాకుండా అంత్యక్రియల కోసం రూ.20వేలు చెల్లించాలన్నారు.